E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం :
9959812941-9949356387

PUBLISHED: TELANGANA సంపుటి :01 సంచిక :154 బుధవారం 13 మే 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 08 వెల :05/-

# తెలంగాణపై నిప్పుల వర్షం

## 14 నుంచి ఎండల మోత

- 47 డిగ్రీల హెచ్చరిక
- రాష్ట్రానికి రెడ్ అలర్ట్
- ఉత్తర తెలంగాణ అల్లాడే ఎండలు
- వడగాల్పుల తీవ్ర హెచ్చరిక
- హైదరాబాద్‌లో 44 డిగ్రీలు
- మధ్యాహ్నం బయటకు రావొద్దు
- వడదెబ్బపై అప్రమత్తం
- చిన్నారులు, వృద్ధులకు జాగ్రత్త
- నీరు ఎక్కువగా తాగండి
- హీట్‌వేవ్ ప్లాన్ అమలు
- ఉపాధి పనులకు ఆంక్షలు



తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలకమైన హెచ్చరిక జారీ చేసింది. మే 14వ తేదీ నుంచి మే 21వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన వడగాల్పులు వీస్తాయని అంచనా వేస్తున్నారు. గడిచిన కొద్ది రోజులుగా కురిసిన అకాల వర్షాల వల్ల కాస్త ఉపశమనం లభించినప్పటికీ.. ఇకపై భానుడి భగభగలు రెట్టింపు కానున్నాయని తెలంగాణ వెదర్ మ్యాన్ వెల్లడించారు. ప్రధానంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత రికార్డు స్థాయికి చేరనుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 47 డిగ్రీల సెల్సియస్ దాటే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కుమురం భీమ్ ఆసిఫాబాద్ వంటి జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలలను రెడ్ మార్క్ జిల్లాల జాబితాలో చేర్చారు. ఈ ప్రాంతాల్లో మే 14 నుండి వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంటుందన్నారు. గాలిలో తేమ శాతం తగ్గి, పొడి గాలులు వీయటం వల్ల వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఇక భాగ్యనగర ప్రజలకు కూడా ఊరట లేదు

మిగతాది 2 లో..

# వాహనదారులకు షాక్

## పెట్రోల్ ధర పెంపుపై కేంద్ర మంత్రి బిగ్ హింట్



2 లో

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు బ్యారెల్ 105 డాలర్లు దాటి దూసుకుపోతున్న నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలు యోచిస్తున్నాయని ప్రచారం జరుగుతున్న వేళ పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి సంచలన వ్యాఖ్యలు చేశారు.దేశంలో ఎక్కడా ఇంధన కొరత లేదని, ఎల్పీజీ ఉత్పత్తిని పెంచామన్నారు.

# మెడికల్ విద్యార్థుల ఆశలు ఆవిరి

## నీట్ (యూజీ)-2026 పరీక్ష రద్దు




2 లో

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్న నీట్ యూజీ- 2026 పరీక్షపై కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మే 3న జరిగిన పరీక్షను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

# 'బీజేపీ-ఈసీ చోర్ బజార్'

## బెంగాల్ ప్రభుత్వ నిర్ణయంపై రాహుల్ ఆరోపణలు



2 లో

పశ్చిమ బెంగాల్ రాజకీయాలు ఆసక్తిని రేపుతున్నాయి. కొత్తగా కొలువు దీరిన సువేందు అధికారి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకున్న చర్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిగా పని చేసిన మనోజ్ అగర్వాల్ ను ఆ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించడం రాజకీయంగా రచ్చకు కారణం అవుతోంది.ఈ నియామకంపై ఇప్పటికే టీఎంసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా తాజాగా లోక్ సభలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ చర్యను 'బీజేపీ-ఈసీ చోర్ బజార్' గా అభివర్ణించారు.

# వరుసగా మూడోసారి

## అస్సాం సీఎంగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారం

హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారంతో అస్సాం రాజకీయాల్లో చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. గౌహతిలోని ఖానాపరాలో మంగళవారం జరిగిన అట్టహాసమైన వేడుకలో హిమంత బిశ్వ శర్మ అస్సాం ముఖ్యమంత్రిగా వరుసగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణం చేయించారు.బిశ్వ శర్మ తో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా , చరణ్ బోరో, అజంతా నియోగ్ వంటి కీలక నేతలు మంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ నేత రంజిత్ దాస్‌ను అసెంబ్లీ స్పీకర్ అభ్యర్థిగా ఎంపిక చేశారు.



2 లో

# హైకోర్టులో బండి భగీరథ్ పిటిషన్..

## ఊరట లభించేనా?



2 లో

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన పోక్సో కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బండి భగీరథ్‌పై తీవ్రమైన ఆరోపణలు రావడంతో పోలీసులు ఆయనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఒక మైనర్ బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించారనే ఫిర్యాదుతో ఈ కేసు నమోదైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ కేసు రాజకీయంగా, సామాజికంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది.

# అమరావతి పనుల్లో వేగం

## త్వరలో జీఏడీకి ప్రభుత్వ భవనాలు: మంత్రి నారాయణ

రాష్ట్ర రాజధాని అమరావతి పనుల పురోగతిపై ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ మంగళవారం కీలక ప్రకటన చేశారు. అమరావతిలో అభివృద్ధి పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని, మూడు షిఫ్టుల్లో పనులను కొనసాగిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు కావాలనే అమరావతి ప్రాజెక్ట్ పై రాజకీయ కుట్రలు చేస్తున్నాయని, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు.



2 లో

అలాగే రైతులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియపై స్పష్టతనిస్తూ, ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన రైతుల్లో ఇప్పటి వరకు 98.06 శాతం మందికి ప్లాట్ల కేటాయింపు పూర్తయిందని మంత్రి తెలిపారు. ఇంకా కేవలం 674 మంది రైతులకు మాత్రమే ప్లాట్లు ఇవ్వాల్సి ఉందని, అది కూడా కోర్టు కేసులు, ఇతర సాంకేతిక కారణాల వల్ల పెండింగ్‌లో ఉందని వివరించారు.

# రైతులకు ఇబ్బంది కలిగితే సహించబోం

## కలెక్టర్లపైనా చర్యలు తప్పవు: సీఎం రేవంత్

- ధాన్యం సేకరణలో వేగం పెంచాలి
- రవాణా ఆలస్యంపై కఠిన చర్యలు
- కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాల కల్పన
- ప్రతి గింజ కొనుగోలే లక్ష్యం
- కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ
- 24 గంటల్లో ధాన్యం తరలింపు
- అకాల వర్షాలకు ముందస్తు జాగ్రత్తలు



2 లో

తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం,
మే 13 2026



## వాహనదారులకు షాక్

## పెట్రోల్ ధర పెంపుపై కేంద్ర మంత్రి బిగ్ హింట్

మొదటి పేజీ తరువాయి



ఉత్పత్తిని రోజుకు 36,000 టన్నుల నుంచి 54,000 టన్నులకు చేర్చినట్లు వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని తట్టుకోవడానికి ప్రధాని మోదీ పిలుపు ఓ మేల్కొలుపు అని 69 రోజులకు సరిపడా ముడి చమురు, 45 రోజులకు సరిపడా ఎల్పీజీ స్టాక్ ఉందన్నారు. సీఐఐ వార్షిక బిజినెస్ సమ్మిట్ 2026లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ధరలు పెరగవని నేను చెప్పడం లేదు:

ఇటీవల ముగిసిన రాష్ట్ర ఎన్నికల కారణంగా ప్రభుత్వం ధరల సవరణను వాయిదా వేసిందని ఎన్నికలు ముగిసిపోవడంతో ఇక ధరలు పెంచబోతోందనే వాదనను ఆయన తోసిపుచ్చారు. మేము సవాలును ఒక అవకాశంగా మార్చుకున్నాం. గత నాలుగేళ్లుగా మేము ధరలను పెంచలేదు. ధరలు పెరగవని నేను చెప్పడం లేదు కానీ ధరలకు, ఎన్నికలకు సంబంధం లేదని చెబుతున్నాను అని కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు రోజుకు రూ.1,000 కోట్లు నష్టపోతున్నాయని మంత్రి అన్నారు. ఈ సంస్థలు వసూళ్ల కింద రూ. 198,000 కోట్లు సంపాదిస్తున్నాయని, ఈ త్రైమాసికంలో నష్టాలు రూ. 1 లక్ష కోట్లుగా ఉన్నాయని ఆయన చెప్పారు. ఇదిలా ఉంటే ఈ నెల 15 లోగా పెట్రోల్ ధరలు పెరిగే అవకాశం ఉందని లీటర్ కు ఏకంగా రూ. 5 వరకు పెంచే చాన్స్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## హైకోర్టులో బండి భగీరథ్ పిటిషన్.. ఊరట లభించేనా?



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన పోక్సో కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బండి భగీరథ్‌పై తీవ్రమైన ఆరోపణలు రావడంతో పోలీసులు ఆయనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఒక మైనర్ బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించారనే ఫిర్యాదుతో ఈ కేసు నమోదైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ కేసు రాజకీయంగా, సామాజికంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది.

హైకోర్టులో పిటిషన్..

పోలీసులు తనను అరెస్ట్ చేసే అవకాశం ఉందన్న ఉద్దేశంతో భగీరథ్ హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. తనపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ కేసు పెట్టారని పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఆయన న్యాయస్థానాన్ని కోరారు. బండి భగీరథ్ దాఖలు చేసిన ఈ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు సానుకూలంగా స్పందించింది. దీనిపై పూర్తిస్థాయి విచారణను గురువారం చేపట్టనున్నట్లు న్యాయస్థానం వెల్లడించింది. పోలీసుల తరపున వాదనలు విన్న తర్వాత కోర్టు తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ కేసులో హైకోర్టు తీర్పు ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

## మెడికల్ విద్యార్థుల ఆశలు ఆవిరి నీట్ (యూజీ)-2026 పరీక్ష రద్దు

మొదటి పేజీ తరువాయి

రాజస్థాన్‌లో పేపర్ లీక్ అయినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో పరీక్ష పారదర్శకతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది.

కాగా, మే 3న నిర్వహించిన నీట్ పరీక్షకు సంబంధించి 'గెస్ పేపర్' లీక్ అయిందనే వార్తలు రాజస్థాన్‌లో కలకలం రేపాయి. దర్యాప్తు సంస్థల నుంచి అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. పరీక్షా ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. దీంతో విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరీక్షను రద్దు చేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్ణయించింది. ఈ పేపర్ లీక్ వెనుక ఉన్న సూత్రధారులను పట్టుకోవడానికి కేసును సీబీఐకి అప్పగించారు. రద్దు చేసిన పరీక్షను త్వరలోనే తిరిగి నిర్వహించనున్నారు. ఇక పరీక్ష కొత్త తేదీలను ఎన్‌టీఏ తన అధికారిక వెబ్‌సైట్‌లో వెల్లడించనుంది. అయితే, రీ-ఎగ్జామ్ కోసం విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని ఎన్‌టీఏ తెలిపింది. పాత హాల్‌టికెట్లు, కొత్త అడ్మిట్ కార్డుల ద్వారా ఎలాంటి అదనపు రుసుము లేకుండా అభ్యర్థులు పరీక్షకు హాజరుకావొచ్చని అధికారులు తెలిపారు.

విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన..

పరీక్ష రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది విద్యార్థులు ఈ నిర్ణయంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అయితే, అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతోనే మళ్లీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. విద్యార్థులు వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక ప్రకటనలనే అనుసరించాలని సూచించింది.

## 'బీజేపీ-ఈసీ చోర్ బజార్'...బెంగాల్ ప్రభుత్వ నిర్ణయంపై రాహుల్ ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి



ఎక్స్ వేదికగా పోస్టును షేర్ చేస్తూ ఎన్నికల సంఘానికి, బీజేపీ కుమ్మక్కు అయ్యాయని దొంగతనం ఎంత పెద్దదైతే ప్రతిఫలం అంత పెద్దదిగా ఉంటుందన్నారు.

టీఎంసీ ఆగ్రహం:

ఈ నియామకంపై తృణమూల్ కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది సిగ్గుచేటు చర్యగా అభివర్ణించారు. ఎన్నికల కమిషన్, బీజేపీ కలిసి బెంగాల్ ఎన్నికలను దొంగిలించారని ఇందుకు ఇదే నిదర్శనం అని అని మండిపడ్డారు. ఈ చర్యతో ఈ ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని ఎవరైనా విశ్వసిస్తారా అని టీఎంకే నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రతిపక్షాల విమర్శలను బీజేపీ తిప్పికొడుతోంది. గతంలో మమతా బెనర్జీ ప్రభుత్వం అర్హత ఉన్న సీనియర్లను కాదని తనకు నచ్చిన వారికి పదవులు ఇచ్చి బ్యూరోక్రసీని భ్రష్టు పట్టించారని దుయ్యబట్టింది. మనోజ్ అగర్వాల్ ను మెరిట్ ప్రాతిపదికననే నియమించినట్లు బీజేపీ స్పష్టం చేసింది.

## వరుసగా మూడోసారి...అస్సాం సీఎంగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారం



హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారంతో అస్సాం రాజకీయాల్లో చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. గౌహతిలోని ఖానాపరాలో నేడు (మే 12, 2026) జరిగిన అట్టహాసమైన వేడుకలో హిమంత బిశ్వ శర్మ అస్సాం ముఖ్యమంత్రిగా వరుసగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణం చేయించారు. బిశ్వ శర్మ తో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా , చరణ్ బోరో, అజంతా నియోగ్ వంటి కీలక నేతలు మంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ నేత రంజిత్ దాస్‌ను అసెంబ్లీ స్పీకర్ అభ్యర్థిగా ఎంపిక చేశారు.

ఈ కార్యక్రమం దేశంలోని అగ్రనేతల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్ (యూపీ), నారా చంద్రబాబు నాయుడు (ఏపీ), నెయిఫియు రియో (నాగాలాండ్) సహా ఎన్డీయే కూటమికి చెందిన ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు ఈ వేడుకలో పాల్గొని హిమంత బిశ్వ శర్మకు అభినందనలు తెలిపారు. 126 స్థానాలున్న అస్సాం అసెంబ్లీలో ఎన్డీయే కూటమి 102 స్థానాల భారీ మెజారిటీతో విజయం సాధించిన నేపథ్యంలో, ఈ విజయోత్సవ సభ అస్సాం అభివృద్ధిలో కొత్త శకానికి నాంది పలికిందని నేతలు కొనియాడారు.

## అమరావతి పనుల్లో వేగం.. త్వరలో జీఏడీకి ప్రభుత్వ భవనాలు: మంత్రి నారాయణ



రాష్ట్ర రాజధాని అమరావతి పనుల పురోగతిపై ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ మంగళవారం కీలక ప్రకటన చేశారు. అమరావతిలో అభివృద్ధి పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయని, మూడు షిఫ్టుల్లో పనులను కొనసాగిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు కావాలనే అమరావతి ప్రాజెక్ట్ పై రాజకీయ కుట్రలు చేస్తున్నాయని, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు.

అలాగే రైతులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియపై స్పష్టతనిస్తూ, ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన రైతుల్లో ఇప్పటి వరకు 98.06 శాతం మందికి ప్లాట్ల కేటాయింపు పూర్తయిందని మంత్రి తెలిపారు. ఇంకా కేవలం 674 మంది రైతులకు మాత్రమే ప్లాట్లు ఇవ్వాల్సి ఉందని, అది కూడా కోర్టు కేసులు, ఇతర సాంకేతిక కారణాల వల్ల పెండింగ్‌లో ఉందని వివరించారు. ప్లాట్ల కేటాయింపు అంతా అత్యంత పారదర్శకంగా లాటరీ పద్ధతిలో జరిగిందని ఆయన స్పష్టం చేశారు.

అమరావతిలో మంత్రులు, ఐఏఎస్ అధికారులు, న్యాయమూర్తుల కోసం నిర్మిస్తున్న నివాస భవనాలు తుది దశకు చేరుకున్నాయని నారాయణ పేర్కొన్నారు. మే నెలాఖరు నాటికి దాదాపు 90 శాతం ప్రభుత్వ భవనాలు సిద్ధమవుతాయని, ఫినిషింగ్ పనులు పూర్తి కాగానే వాటన్నింటినీ సాధారణ పరిపాలన శాఖ కు అప్పగిస్తామని వెల్లడించారు. రాజధాని నిర్మాణాన్ని మూడు దశల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, మొదటి దశను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ఆంధ్రుల కలల రాజధానిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

## రైతులకు ఇబ్బంది కలిగితే సహించబోం కలెక్టర్లపైనా చర్యలు తప్పవు: సీఎం రేవంత్




తెలంగాణలో యాసంగి పంట కోతలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మంగళవారం సెక్రటేరియట్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధాన్యం సేకరణ ప్రక్రియను సమీక్షించారు. పాఠశాలలు దేశ భవిష్యత్తుకు వేదికలైతే.. వ్యవసాయం దేశానికి వెన్నెముక అని.. రైతులు తాము పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద గంటల తరబడి వేచి చూసే పరిస్థితి ఉండకూడదన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఏ చిన్న పొరపాటు జరిగినా.. అది రైతులపై ఆర్థిక భారాన్ని మోపుతుందని కాబట్టి ప్రతి అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాలని సీఎం ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ఎక్కడా రాజీ పడకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా రైతులకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించడంతో పాటు, ధాన్యం తూకం వేయడానికి అవసరమైన గన్నీ బ్యాగులు, విద్యుత్ కాటా యంత్రాలు, హమాలీల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మొక్కజొన్న సాగు ఎక్కువగా ఉన్న ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అని జిల్లా కలెక్టర్లే స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. అధికారులు కేవలం కార్యాలయాలకు పరిమితం కాకుండా.. కళ్లాల వద్దకు వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకోవాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

ధాన్యం సేకరణలో ప్రధాన అడ్డంకిగా మారుతున్న రవాణా సమస్యపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని 24 గంటల్లోగా గోడౌన్లకు తరలించాల్సిందేనని డెడ్ లైన్ విధించారు. ఒప్పందం చేసుకున్న ప్రకారం లారీలను పంపని రవాణా కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాకుండా.. వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల ధాన్యం తడిసిపోయినా లేదా రైతులకు నష్టం వాటిల్లినా ఆ భారాన్ని ప్రభుత్వం భరించదని నేరుగా బాధ్యులపై చర్యలు తీసుకుంటుందని సీఎం స్పష్టం చేశారు. రవాణా శాఖ కమిషనర్‌తో మాట్లాడి.. అదనపు వాహనాల అవసరం ఉంటే వెంటనే సమకూర్చుకోవాలని కలెక్టర్లకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు.

రాష్ట్రంలో ధాన్యం నిల్వ సామర్థ్యంపై కూడా ముఖ్యమంత్రి సమీక్షించారు. గోడౌన్లు నిండిపోయిన ప్రాంతాల్లో ధాన్యాన్ని భద్రపరిచేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. రైతుబజార్లు, కమ్యూనిటీ హాళ్లు, ఫంక్షన్ హాళ్లను తాత్కాలికంగా ధాన్యం నిల్వ కేంద్రాలుగా మార్చుకోవాలని చెప్పారు. అకాల వర్షాల ముప్పు ఉన్నందున ధాన్యంపై టార్పాలిన్లు కప్పేలా చూడాలని ఏ దశలోనూ ధాన్యం నిల్వలు పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మొత్తం ప్రక్రియపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రోజువారీ నివేదికలు పంపాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## తెలంగాణపై నిప్పుల వర్షం 14 నుంచి ఎండల మోత




తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలకమైన హెచ్చరిక జారీ చేసింది. మే 14వ తేదీ నుంచి మే 21వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన వడగాల్పులు వీస్తాయని అంచనా వేస్తున్నారు. గడిచిన కొద్ది రోజులుగా కురిసిన అకాల వర్షాల వల్ల కాస్త ఉపశమనం లభించినప్పటికీ.. ఇకపై భానుడి భగభగలు రెట్టింపు కానున్నాయని తెలంగాణ వెదర్ మ్యాన్ వెల్లడించారు. ప్రధానంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత రికార్డు స్థాయికి చేరనుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 47 డిగ్రీల సెల్సియస్ దాటే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కుమురం భీమ్ ఆసిఫాబాద్ వంటి జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలలను రెడ్ మార్క్ జిల్లాల జాబితాలో చేర్చారు. ఈ ప్రాంతాల్లో మే 14 నుండి వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉంటుందన్నారు. గాలిలో తేమ శాతం తగ్గి, పొడి గాలులు వీయటం వల్ల వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఇక భాగ్యనగర ప్రజలకు కూడా ఊరట లేదు. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల సెల్సియస్ నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకపోవడమే శ్రేయస్కరమని సూచిస్న?న్నారు.

తీవ్రమైన ఎండల దృష్ట్యా ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంటున్నారు. దాహం వేయకపోయినా ప్రతి గంటకు నీరు తాగుతూ ఉండాలని.. కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్, నిమ్మరసం వంటి పానీయాలు శరీరంలో ఎలక్ట్రోలైట్ స్థాయిని కాపాడుతాయని సూచిస్తున్నారు. మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని, కెఫీన్ ఉండే కాఫీ, టీ, ఆల్కహాల్‌ను దూరంగా ఉండాలంటున్నారు. లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని.. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లేదా కళ్లద్దాలను వాడటం మర్చిపోవద్దని చెబుతున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళ ప్రయాణాలు చేయవద్దని.. ఒకవేళ బయట ఉన్నప్పుడు తల తిరగడం, వాంతులు లేదా నీరసం అనిపిస్తే వెంటనే నీడకు చేరుకోవాలని సూచిస్తున్నారు.

కాగా, తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఆయా జిల్లాల్లో హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తోంది. మధ్యాహ్నం వేళ ఉపాధి హామీ పనులు నిర్వహించకూడదని, ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద నీడ సౌకర్యం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి ఈ వారం రోజుల పాటు జాగ్రత్తగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## తమిళనాడులో పొలిటికల్ సెన్సేషన్..

### ఏఐఏడీఎంకే చీలిక, 150కి చేరిన సీఎం విజయ్ బలం



తమిళనాడు రాజకీయాల్లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ప్రతిపక్షం ఏఐఏడీఎంకే లో ఆ పార్టీ సీనియర్ నేత షణ్ముగం తిరుగుబాటు బావుటా ఎగురవేస్తూ, తన వర్గం ఎమ్మెల్యేలతో కలిసి సీఎం విజయ్, టీవీకే నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతు ప్రకటిస్తున్నట్లుగా వెల్లడించారు. అయితే, షణ్ముగం వెంట దాదాపు 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే ఆయన తన మద్దతుదారులతో సమావేశమై ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. నేడు అసెంబ్లీలో జరగనున్న ఫ్లోర్ టెస్ట్‌లో సీఎం విజయ్‌కు అనుకూలంగా ఓటు వేస్తామని ఆయన స్పష్టం చేశారు. దీంతో విజయ్ మెజారిటీ మార్కు ఒక్కసారిగా 150కి చేరనుంది.

విజయ్ సర్కార్ సేఫ్..

సీఎం బాధ్యతలు చేపట్టిన విజయ్‌కు సొంత పార్టీ బలం తక్కువగా ఉందన్న విమర్శల నేపథ్యంలో ఏఐఏడీఎంకే నుంచి వస్తున్న ఈ మద్దతు ఆయనకు కొండంత బలాన్ని ఇస్తోంది. మరోవైపు, ఈ చీలికతో మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి నాయకత్వంలోని ఏఐఏడీఎంకే తీవ్ర సంక్షోభంలో పడింది.

## భారత వృద్ధి రేటు మరింత కుదించిన మూడీస్.. 6 శాతానికే పరిమితం

అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్, 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత ఆర్థిక వృద్ధి అంచనాలను మరింత కుదించడం దేశీయ ఆర్థిక వర్గాల్లో చర్చనీయాంశమైంది. గతంలో భారత జీడీపీ వృద్ధిని 6.8 శాతంగా అంచనా వేసిన మూడీస్, తాజా నివేదికలో దానిని 6.0 శాతానికి కుదించింది. అంటే దాదాపు 0.8 శాతం మేర కోత విధించింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మాత్రం వృద్ధి రేటు 7.6 శాతంగా బలంగా ఉంటుందని అంచనా వేసింది. వృద్ధి అంచనాలు తగ్గించినప్పటికీ, జీ20 దేశాలన్నింటిలోనూ భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని మూడీస్ స్పష్టం చేయడం కొంత సానుకూల అంశం.

ఈ వృద్ధి అంచనాల కోతకు ప్రధానంగా అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కారణమని మూడీస్ విశ్లేషించింది. ముఖ్యంగా పశ్చిమ ఆసియాలో నెలకొన్న అనిశ్చితి వల్ల ముడిచమురు ధరలు పెరగడం భారత ఆర్థిక వ్యవస్థపై భారంగా మారింది. దీనివల్ల రవాణా ఖర్చులు పెరిగి, పరిశ్రమల ఇన్‌పుట్ వ్యయం భారమవ్వడమే కాకుండా, సాధారణ ప్రజల ప్రైవేట్ వినియోగం కూడా తగ్గుముఖం పట్టింది. ముడిచమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే భారత్ వంటి దేశాలకు, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం వల్ల విదేశీ మారక ద్రవ్యం ఎక్కువగా ఖర్చవుతుంది, ఇది నేరుగా దేశ వాణిజ్య లోటుపై ప్రభావం చూపుతోంది. అంతేకాదు ఇటీవల ఎస్అండ్‌పీ గ్లోబల్, ఏడీబీ కూడా భారత వృద్ధి రేటు గణనీయంగా పడిపోనుందని అంచనా వేసాయి.

## సీఎం విజయ్ సంచలన నిర్ణయం..

### ఏకంగా 717 వైన్ షాపుల మూసివేత

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మూడో రోజే తలపతి విజయ్ ప్రజా సక్షేమం కోసం మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా, ప్రజలకు అసౌకర్యంగా ఉన్న 717 వైన్ షాపులను రాబోయే 2 వారాల్లోగా మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల భవిష్యత్తు, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఉన్నవి, ఆలయాలు, చర్చిలు, మసీదులకు దగ్గరగా ఉన్నవి, ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే 500 మీటర్ల పరిధిలో ఉన్న దుకాణాలను తక్షణమే తొలగించా ఆర్డర్స్ వెలువడ్డాయి.

కాగా, తమిళనాడు రాష్ట్ర వాణిజ్య సంస్థ ద్వారా ప్రస్తుతం రాష్ట్రంలో 4,765 మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. అందులో నిబంధనలు విరుద్ధంగా 717 మద్యం దుకాణాలు నడుస్తున్నట్లుగా గుర్తించారు. వాటన్నింటినీ 2 వారాలు అంటే 14 రోజుల వ్యవధిలో పూర్తిగా మూసివేయించాలని సీఎం విజయ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# సబ్ సెంటర్లో వైద్య సేవలు వెంటనే ప్రారంభించాలి

## -- సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు వడ్లకొండ సుధాకర్ డిమాండ్

తెలుగు గళం న్యూస్ జఫర్‌గడ్ మే12

మండలంలోని తమ్మడపల్లి జి గ్రామంలో లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన సబ్ సెంటర్‌లో వెంటనే వైద్య సేవలు అందించాలని సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు వడ్లకొండ సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది సురేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందిస్తున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం తమ్మడపల్లి జి గ్రామ సబ్ సెంటర్‌లో వైద్య సిబ్బందిని నియమించడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్య సేవలు అందక పేదలు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో లక్షల్లో ఫీజులు వసూలు చేయడం వల్ల కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల భారం తట్టుకోలేక అనేక కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వేల్పుల పెద్ద రాములు, ఎండి ఆకు పాషా, అన్యపు అజయ్, అన్నయ, వేల్పుల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.




# జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

## : డాక్టర్ సీపాన గుణవతి



తెలుగు గళం న్యూస్ శ్రీకాకుళం, మే 12

"సమాజ అభివృద్ధి, సంస్కరణలలో వంద గన్నులు చేయలేని పనిని ఒక పెన్ను చేస్తుంది" అనే సామెతను నేటి జర్నలిస్టులు తమ నిరంతర కృషితో నిజం చేస్తున్నారని అఖిల భారత బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కన్వీనర్, ప్రముఖ సంఘ సేవకురాలు డాక్టర్ సీపాన గుణవతి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, జర్నలిస్టులు ప్రజలకు--ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మీడియా ప్రతినిధుల సంక్షేమం, భద్రత, గౌరవం విషయంలో కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు మరింత బాధ్యతగా వ్యవహరించాలని ఆమె కోరారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జారీ చేసిన మార్గదర్శకాలు మీడియా స్వేచ్ఛ, జర్నలిస్టుల హక్కులు, వృత్తి నైతిక విలువలను కాపాడేలా ఉన్నాయని, వాటిని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు, బెదిరింపులు, దాడులు, వార్తా సేకరణలో ఆటంకాలను కఠినంగా అరికట్టాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఇది ప్రజాస్వామ్యానికి ముప్పని అన్నారు. జర్నలిస్టు స్వేచ్ఛను కాపాడడం అంటే రాజ్యాంగ పరిరక్షణను కాపాడినట్టేనని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ప్రత్యేక ఆరోగ్య భీమా, ప్రమాద భీమా, పెన్షన్, కుటుంబ భద్రతా పథకాలు, పిల్లలకు విద్యా సహాయం, హౌసింగ్ స్థలాలు, తక్కువ వడ్డీ రుణాలు, ఉచిత వైద్య సేవలు, అత్యవసర సహాయ నిధి, రవాణా రాయితీలు వంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఆమె కోరారు. గ్రామీణ విలేకరులకు ప్రత్యేక రక్షణ వ్యవస్థ అవసరమని తెలిపారు. జర్నలిస్టుల భద్రత కోసం "జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్" పేరుతో ప్రత్యేక చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు, భారత రాష్ట్రపతికి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సమాజంలో భూ ఆక్రమణలు, అవినీతి, మహిళలపై దాడులు, ప్రభుత్వ వైఫల్యాలను వెలుగులోకి తీసుకువచ్చేది జర్నలిస్టులేనని పేర్కొన్నారు. ప్రజల గొంతుకగా ఉన్న మీడియాపై దాడులు జరగడం ఆందోళనకరమని అన్నారు. దేశంలో ఎక్కడైనా జర్నలిస్టులపై దాడి జరిగితే గాయపడిన వారికి కనీసం రూ.10 లక్షలు, మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే కుటుంబ సభ్యులకు ఉద్యోగం, పిల్లలకు ఉచిత విద్య, నివాస భద్రత కల్పించాలని కోరారు. తాను దాదాపు పదేళ్లపాటు జర్నలిస్టుగా పనిచేసిన అనుభవంతో మీడియా రంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు తనకు బాగా తెలుసని డాక్టర్ గుణవతి తెలిపారు. రాజ్యాంగ పరంగా జర్నలిస్టులు గౌరవనీయమైన వృత్తిలో ఉన్నారని, వారికి స్వతంత్రత అవసరమని అన్నారు. ఆర్‌ఎన్‌ఐ ద్వారా నమోదు పొందిన పత్రికలను పెద్ద-- చిన్న తేడా లేకుండా సమానంగా చూడాలని, ప్రభుత్వ ప్రకటనలు సమానంగా ఇవ్వాలని సూచించారు. గ్రామీణ పత్రికలు కూడా సమాజానికి కీలక సేవ చేస్తున్నాయని అన్నారు. పత్రికా సంస్థల్లో కాంట్రిబ్యూటర్లు ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి భీమా, ప్రయాణ భత్యం, రవాణా, అత్యవసర వైద్య సహాయం తప్పనిసరిగా కల్పించాలని సూచించారు. జర్నలిస్టులపై దాడి జరిగిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగవంతమైన విచారణ చేపట్టేలా పోలీస్ శాఖకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు జారీ చేయాలని ఆమె కోరారు. కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి "జర్నలిస్టుల సంక్షేమ నిధి" ఏర్పాటు చేసి ప్రమాదాలు, అనారోగ్యం, మరణాల సందర్భాల్లో కుటుంబాలకు తక్షణ ఆర్థిక భరోసా కల్పించాలని డాక్టర్ గుణవతి విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు

## ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేసిన రావుల రంజిత్ రెడ్డి -జ్యోతి దంపతులు

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

హనుమాన్ జయంతి ని పురస్కరించుకొని ఈ రోజు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రం రాంపురం గ్రామంలోని శ్రీఅభయఆంజనేయ స్వామి ఆలయం లో రావుల రంజిత్ రెడ్డి -జ్యోతి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు, గ్రామ పూజారి శ్రీనివాస్ అయ్యగారు ప్రత్యేక పూజలు చేశారు, ఆంజనేయ స్వామి జన్మదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు, హనుమంతుడు భక్తి, బలం, ధైర్యం మరియు సేవకు ప్రతీకగా భావించబడతాడు అని తెలిపారు. రామాయణంలో శ్రీరాముడికి అత్యంత విశ్వాసపాత్రుడిగా నిలిచిన హనుమంతుడు ప్రజలలో ఆదర్శవంతుడిగా గుర్తింపు పొందాడు అని, హనుమాన్ జయంతి రోజున భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు అన్నారు. హనుమాన్ చాలీసా పారాయణం చేసి స్వామివారిని ప్రార్థిస్తారు అన్నారు. ఈ పండుగ మనకు భక్తి, క్రమశిక్షణ, సేవాభావం వంటి మంచి గుణాలను నేర్పుతుంది అని హనుమంతుని ఆశీస్సులతో మన గ్రామ ప్రజలు, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, పాడి పంటలతో ఉండాలని రావుల రంజిత్ రెడ్డి -జ్యోతి దంపతులు ఆ స్వామి వారిని కోరుకుని భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ వైస్ ఎంపీపీ అశోక్ రెడ్డి, రామసహాయం జైపాల్ రెడ్డి, రామసహాయం విష్ణువర్ధన్ రెడ్డి,ఈరగని వెంకన్న గౌడ్, మాజీ ఎంపీటీసీ కొమ్ము నరేష్, ఎల్డి మల్లయ్య, హెల్ది, వెంకటేశ్వర్లు, ఎడ్ల నర్సయ్య,ఉరుగొండ వెంకన్న, బుడిగే యాదగిరి, దోమల సోమన్న, దోమల అశోక్, రాంపెల్లి వెంకన్న, మాదుగుల వెంకన్న, తాళ్ల మంగయ్య, గొనె మహేష్, బందు పర్శరాములు, దిద్ది వెంకన్న, బొల్ల శ్రీరాములు, అనుముల సోమిరెడ్డి, వంగ రామిరెడ్డి, వెంకటరెడ్డి, శెరబందు కృష్ణ, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.









# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే నాగరాజు

తెలుగు గళం న్యూస్, పర్వతగిరి / మే 12 :

వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధిలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మంగళవారం దేవిలాల్ తండా కి చెందిన జాటోతు నీలమ్మ - ధర్మ నాయక్ దంపతుల కుమారుడు రాజు -సౌందర్య వధూవరులను వివాహపు విందు కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించినారు.


ఈ కార్యక్రమం లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్ .ఎమ్మెల్యే వెంట స్థానిక చీదురు శంకర్, ఏనుగల్ సర్పంచ్ తొర్రి పద్మ యాదవ్, రోలకల్ సర్పంచ్ మంగ్య నాయక్, ఎస్టి సెల్ నాయకులు బానోత్ భాస్కర్, రావూర్ గ్రామ అధ్యక్షుడు ఆబర్ల రవి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ , సీనియర్ నాయకులు బొట్ల కనకరాజు, కార్యకర్తలు మరియు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# "కేంద్ర మంత్రికి చట్టం చుట్టమా?"

## తెలంగాణ రక్షణ సేన ఆగ్రహం

తెలుగు గళం న్యూస్ కరీంనగర్ మే12




కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథపై నమోదైన పోక్సో ఆక్ట్ కేసు వ్యవహారంపై తెలంగాణ రక్షణ సేన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని ఆ సంస్థ డిమాండ్ చేసింది. సంస్థ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ--- మైనర్ బాలికపై మానసిక, లైంగిక వేధింపులు జరగడం అత్యంత దుర్మార్గమని ఖండించారు. "సామాన్యుడికి ఒక చట్టం, కేంద్ర మంత్రి కుమారుడికి మరో చట్టం ఉంటుందా?" అని ప్రశ్నించారు. పోక్సో కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు నిందితుడిని అరెస్టు చేయకపోవడం తెలంగాణ పోలీస్ వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. బాధిత కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ, ఈ వ్యవహారంలో కేంద్ర మంత్రి పాత్రపై కూడా విచారణ జరిపి, ఆయనను పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రిగా రాజ్యాంగంపై ప్రమాణం చేసిన వ్యక్తి బాధితురాలికి అండగా ఉండాల్సింది పోయి, నిందితుడికి సహకరిస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్‌కు కేంద్ర మంత్రిగా కొనసాగే నైతిక హక్కు లేదని అన్నారు. అదేవిధంగా, స్థానిక పోలీస్‌లు కేసులో కఠినమైన సెక్షన్లు పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. బాధిత కుటుంబం ఫిర్యాదు ఇవ్వడానికి ప్రయత్నించినప్పటికీ ఆలస్యం చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఘటనతో రాష్ట్రంలో చట్టవ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ, వెంటనే నిందితుడిని అరెస్టు చేసి బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేసింది.

# రిసెప్షన్ వేడుకల్లో పాల్గొన్న

## వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

తెలుగు గళం న్యూస్ అనంతపురం, మే 12



అనంతపురం జిల్లా పామిడి మండల కేంద్రంలోని పామిడి పట్టణంలో నిర్వహించిన వివాహ రిసెప్షన్ వేడుకలకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరయ్యారు. మాజీ ఎడిసిసి బ్యాంకు చైర్మన్ పామిడి వీర కుమార్తె మానుకింద లిఖిత రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గుంతకల్ నియోజకవర్గానికి చెందిన కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేడుక ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.

# మర్లపాడు లో ఘనంగా హనుమాన్ జయంతి

## మహన్నదానంలో వందలాదిగా పాల్గొన్న భక్తులు

### చాలీసా పారాయణం





వేంసూరు, మే 12 (తెలుగు గళం) న్యూస్:

ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో వ్యాపార కూడలిలో గల భక్తాంజనేయ స్వామి కోవెలలో మంగళవారం హనుమాన్ జయంతి పండుగను హైందవ భక్తులు ఘనంగా నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో భక్తాంజనేయ స్వామి వారికి అలంకరణ చేశారు. విశిష్ట పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహాన్నదాన (నారాయణ సేవ) కార్యక్రమంలో వందలాదిగా భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించి స్వామి వారికి కానుకలు సమర్పించారు.



# దమ్మన్నపేట వద్ద ఘోర ప్రమాదం

## ట్రాక్టర్ బోల్తా పడి యువ రైతు మృతి

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒక యువ రైతు ప్రాణాలు కోల్పోయారు. రేపాకపల్లి గ్రామానికి చెందిన చేరి సుమన్ (37), ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో తీవ్రంగా గాయపడి మృతి చెందారు.రేగొండ ఎస్ఐ డి. సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు సుమన్ తన పినతండ్రి చేరి ప్రభాకర్ రెడ్డికి చెందిన ట్రాక్టర్ (నంబర్: TS25D 9123) లో ఫామ్ ఆయిల్ గెలలను లోడ్ చేసుకుని, పరకాలలోని ఆయిల్ ఫామ్ కేంద్రానికి వెళ్లారు. ఆయనతో పాటు వరుణ్ సందేశ్ అనే యువకుడు కూడా ట్రాక్టర్‌పై ఉన్నారు. పరకాలలో పంటను అన్లోడ్ చేసిన అనంతరం రాత్రి తిరిగి గ్రామానికి వస్తుండగా, రాత్రి 8 గంటల సమయంలో దమ్మన్నపేట చెరువు సమీపంలోని ప్రమాదకరమైన మలుపు వద్దకు రాగానే ఒక్కసారిగా ట్రాక్టర్ డ్రైవర్ నియంత్రణ కోల్పోయింది. దీంతో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇంజన్ కింద చిక్కుకున్న సుమన్‌కు తల, ఛాతి భాగాల్లో బలమైన గాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు, అటుగా వెళ్తున్న వాహనదారులు స్పందించి, సుమన్‌ను చికిత్స నిమిత్తం పరకాల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ట్రాక్టర్‌పై కూర్చున్న వరుణ్ సందేశ్ అనే యువకుడు ప్రమాదం జరిగిన వెంటనే కిందకు దూకేయడంతో ఎటువంటి గాయాలు లేకుండా ప్రాణాలతో బయటపడ్డాడు. చేతికి వచ్చిన కుమారుడు ప్రమాదంలో మరణించడంతో రేపాకపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేగొండ ఎస్ఐ డి. సుధాకర్ కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# చిన్నకోడెపాక శివారులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి: ఆరుగురు జూదరుల అరెస్ట్

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి




మండల పరిధిలోని చిన్నకోడెపాక గ్రామ శివారులో గల నిర్మానుష్య ప్రాంతంలో సాగుతున్న పేకాట స్థావరంపై కొత్తపల్లి గోరి పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఎస్ఐ సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి అందిన నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం ఈ దాడులు చేపట్టారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి రూ. 5,290 నగదుతో పాటు, 3 మొబైల్ ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన వారిలో గండి నరేష్, సూర్య ప్రకాశ్, లక్ష్మణ్, కిరణ్ తదితరులు ఉన్నారని, వారిని తదుపరి విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ త్రిలోక్ నాథ్ మాట్లాడుతూ.. మండల పరిధిలో ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ముఖ్యంగా గ్రామాల శివారు ప్రాంతాల్లో ఇటువంటి అనైతిక పనులు సాగకుండా నిరంతరం నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు.గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని,ప్రజలు ఇటువంటి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు. ఈ దాడిలో ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

## బండి సంజయ్ రాజీనామాకు బీసీ నేత డిమాండ్

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి, మే 12: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు నమోదై ఐదు రోజులైనా అరెస్టు చేయకపోవడంపై బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా స్పందించారు. నైతిక బాధ్యత వహించి బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.చట్టం అందరికీ సమానమేనా? ఒక ప్రకటన విడుదల చేసిన వెంకట్రాములు, "హైదరాబాద్ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ఐదు రోజులైనా పోలీసులు అరెస్టు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. చట్టాల అమలు సామాన్యులకు ఒక రకంగా, బడా బాబులకు మరో రకంగా ఉంటాయా?" అని ప్రశ్నించారు.

"ప్రధానమంత్రి సభ బందోబస్తులో ఉండి అరెస్టు చేయలేకపోయామని పోలీసులు చెప్పడం విడ్డూరం. బాధితురాలి తల్లిదండ్రులు అనేక రోజులు తిరిగినా కేసు నమోదులో తాత్సారం చేయడం, బాధితురాలిని భయభ్రాంతులకు గురిచేసేలా కరీంనగర్ టూ టౌన్‌లో కేసు నమోదు కావడం పథకం ప్రకారమే జరుగుతున్నట్లు కనిపిస్తోంది" అని ఆరోపించారు. ప్రభుత్వానికి డిమాండ్లు ప్రజా, మహిళా సంఘాల ఒత్తిడితో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారితో విచారణకు ఆదేశించిందని, అయితే కాలయాపన కోసమే విచారణలు అయితే ప్రయోజనం ఉండదని ఆయన పేర్కొన్నారు." ఇలాంటి కేసుల్లో నేరుగా బాధితులను మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టాలని గతంలో బండి సంజయ్ చెప్పారు.మరి ఇప్పుడు మందికైతే ఒక న్యాయం, మనకైతే ఇంకో న్యాయమా? 'బేటీ బచావో' అంటే ఇదేనా?" అని నిలదీశారు. రాజీనామా చేసి విచారణకు సహకరించాలి

"తన కొడుకు నేరం చేయలేదని చెబుతున్న బండి సంజయ్ మంత్రి పదవికి రాజీనామా చేసి విచారణకు సహకరించాలి. కడిగిన ముత్యంలా కొడుకు బయటికి వచ్చిన తర్వాత తిరిగి పదవి స్వీకరిస్తే సబబుగా ఉంటుంది" అని వెంకట్రాములు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ జరిపి, బాధిత



కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని, భగీరథ్‌తో పాటు ఈ వ్యవహారంలో భాగస్వాములైన వారందరినీ చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

# పర్వతగిరి మండలంలో జనాభా లెక్కల హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పరిశీలించిన

## వరంగల్ సీపీఓ చంద్రకళ

తెలుగు గళం న్యూస్, పర్వతగిరి/ మే 12



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో వరంగల్ సీపీఓ శ్రీమతి చంద్రకళ ఏబీ తండా గ్రామపంచాయతీని సందర్శించి, జనాభా లెక్కల హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే విధానాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేసి, వివరాలను పరిశీలించారు. సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి.ఎస్ఓ శ్రవంత్ ,ఏబీ తండా గ్రామపంచాయతీ కార్యదర్శి రజాక్, ఎన్యూమరేటర్లు నరేందర్, మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట మున్సిపాలిటీ పట్టణ ప్రజలకు ఐదు రోజులుగా తాగు నీటి కష్టాలు

## మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం

తెలుగు గళం న్యూస్, వర్ధన్నపేట / మే 12

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పట్టణ ప్రజలకు ఐదు రోజులుగా తాగు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు ఆయన మున్సిపల్ అదికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వివరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిసీసీబీ వెనక సైడు పైపులైను పగిలి వారం రోజులు అవుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ ఇంచార్జి కమిషనర్ కావడంతో కిందిస్థాయి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్న మున్సిపల్ పాలకవర్గం స్పందించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వర్ధన్నపేట పట్టణ ప్రజల నీటి కష్టాలను తీర్చాలని వేడుకుంటున్నారు. లేనిచో మున్సిపల్ ఆఫీసును బిందెలతో ముట్టడిస్తామని పట్టణ ప్రజలు హెచ్చరిస్తున్నారు.




# పర్వతగిరిలో పలు శుభకార్యాల్లో పాల్గొన్న

## మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు

తెలుగు గళం న్యూస్, పర్వతగిరి/మే 12



పర్వతగిరి మండల కేంద్రంలో మాజీ ఉపసర్పంచ్ రంగు జనార్ధన్ దంపతుల పెళ్లిరోజు కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపి, దేవీలాల్ తండా లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ సోదరుని కుమారుని వివాహమహోత్సవంలో హాజరై, నూతన దంపతులను మాజీ జడ్పీటీసీ, సీనియర్ రాజకీయ నాయకులు మేడిశెట్టి రాములు ఆశీర్వదించినారు. ఆయనవెంట ఎనుమాముల మార్కెట్ మాజీ డైరెక్టర్ లు బోంపెల్లి దేవేందర్ రావు, పిన్నింటి సునీల్ రావు, గ్రామ సర్పంచ్ చీదురు శంకర్, మాజీ వైస్ యంపీపీ గంగాధర్ రావు, ప్యాక్స్ వైస్ చైర్మన్ సందెలనవీన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, మాజీ జడ్పీ సభ్యులు మహ్మద్ సర్వర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు గోనె సంపత్, జూలపెల్లి సురేందర్ రావు, కొమ్ము రమేష్, నరెడ్ల సంతోష్, నరెడ్ల సూరయ్య, కంటెం ఏకాంతం, కంటెంసుధాకర్, వెంకట్రాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం..

## పెద్దంపల్లిలో నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

రాష్ట్ర అభివృద్ధికి గ్రామాలే పునాదులని,పల్లెల సమగ్ర ప్రగతి కోసమే ప్రజా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) పేర్కొన్నారు. మంగళవారం రేగొండ మండలంలోని పెద్దంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వ సేవలు గ్రామ స్థాయిలోనే, త్వరితగతిన అందాలనే ఉద్దేశంతో అధునాతన సౌకర్యాలతో ఈ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు స్థానిక పరిపాలనకు కేంద్ర బిందువులని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఈ నూతన భవనం ఎంతగానో దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు వివరించారు. గ్రామాలు అభివృద్ధి పథంలో నడవాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు గ్రామస్తులు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. పెద్దంపల్లి గ్రామ రూపురేఖలు మార్చేందుకు అవసరమైన మరిన్ని నిధుల కేటాయింపునకు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గుటోజు







కిష్టయ్య, రేగొండ పిఎసిఎస్ చైర్మన్ విజ్జన్ రావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎర్రబెల్లి రవీందర్రావు, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, రేగొండ గ్రామ సర్పంచ్ వారణాసి మౌనిక అంజి, రేగొండ మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మీ రవి, పెద్దంపల్లి గ్రామ సర్పంచ్ గడ్డే రఘు, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# దేవిలాల్ తండలో వధూవరులను ఆశీర్వదించిన మార్నేని రవీందర్ రావు

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 12

వరంగల్ జిల్లా: పర్వతగిరి మండలం దేవిలాల్ తండకు చెందిన జాటోతు నీలమ్మ-ధర్మానాయక్ దంపతుల ప్రథమ పుత్రుడు రాజు నాయక్ - సౌందర్య వధూవరుల రిసెప్షన్ కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి మాజీ టిస్కాబ్ చైర్మన్, నందనం సొసైటీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రాములు, ఎనుమాముల మార్కెట్ మాజీ డైరెక్టర్ బొంపల్లి దేవేందర్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, బాలు, సుల్తానా, బిచ్చు నాయక్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బాలికల సాధికారతే లక్ష్యంగా స్నేహ సమ్మర్ క్యాంపులు

## సెర్ప్ సీసీ గోలి కొమురయ్య

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 12

వరంగల్ జిల్లా: పర్వతగిరి,15 నుంచి 18 ఏళ్ల బాలికల సాధికారత కోసం జిల్లాలోని అన్ని గ్రామాల్లో 'స్నేహ బాలిక సంఘాల' ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ గోలి కొమురయ్య తెలిపారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాలు, డీఆర్డీఓ నాగపద్మజ సూచనల మేరకు ఈ క్యాంపులు జరుగుతున్నాయని, ఇందులో భాగంగానే పర్వతగిరి మండలం అనంతారం, గోపనపల్లి, కొంకపాక గ్రామాల్లో స్నేహ బాలికల సమావేశాలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆత్మస్థైర్యంతోనే వికాసం

గోపనపల్లిలో వెలుగు గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కొమురయ్య మాట్లాడుతూ, "కౌమార దశలో వచ్చే శారీరక, మానసిక మార్పులపై బాలికలు అవగాహన పెంచుకోవాలి. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై స్పష్టత ఉండాలి. రక్తహీనత నివారణకు వైద్య పరీక్షలు, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టాలి" అని సూచించారు."విషయ పరిజ్ఞానంతోనే సాధికారత సాధ్యం. నాయకత్వ లక్షణాలు, ఆత్మస్థైర్యం పెంచుకుని వ్యక్తిగత వికాసం సాధించాలి" అని బాలికలకు పిలుపునిచ్చారు. ఆటపాటలతో అవగాహన సదస్సులు

బాలికల ఆసక్తికి అనుగుణంగా లక్ష్యసాధన కోసం ఈ సమ్మర్ క్యాంపుల్లో మార్గనిర్దేశం చేస్తామని, ఆటపాటలతో కూడిన ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని కొమురయ్య తెలిపారు. క్యాంపుల విజయవంతానికి బాలికలు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ సమావేశాల్లో మండలంలోని వివిధ గ్రామాల కమ్యూనిటీ కోఆర్డినేటర్లు శ్యామ్, దేవేందర్, సుధాకర్, వివోఏలు మౌనిక, లావణ్య,సంతోష, సంధ్య,



రాజేశ్వరి, జ్యోష్న, శ్రావణి, యశోద, కరుణ, ఉమా, రాధిక, వివిధ గ్రామాల వివో ప్రతినిధులు, బాలికలు పాల్గొన్నారు.

## హమాలీలకు అండగా లయన్స్ క్లబ్ -దివీటిపల్లిలో దుప్పట్ల పంపిణీ, టెంట్ల ఏర్పాటుకు సూచన



**తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట, మే12** : వరంగల్ జిల్లా: మండుటెండల్లో శ్రమిస్తున్న హమాలీలకు అండగా నిలిచింది జఫర్‌గడ్ లయన్స్ క్లబ్. వర్ధన్నపేట మండలం దివీటిపల్లి గ్రామంలో నూతనంగా ప్రారంభించిన పీఏసీఎస్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా హమాలీలకు దుప్పట్లు పంపిణీ చేసింది."హమాలీల సంక్షేమం అందరి బాధ్యత"

ఈ సందర్భంగా ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ కర్క నరసింహారెడ్డి మాట్లాడుతూ," మండుతున్న ఎండల్లో కష్టపడుతున్న హమాలీల ఆరోగ్యం దృష్ట్యా వారికి తాగునీటి సదుపాయం, నీడ కోసం టెంట్లు, విశ్రాంతి ఏర్పాట్లు చేయాలి. కూలీల సంక్షేమం కోసం ప్రతి సంస్థ బాధ్యతగా ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడాల పూర్ణచందర్ మాట్లాడుతూ," సమాజ సేవే లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యం. అవసరమైన చోట సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం" అని తెలిపారు. హమాలీలకు దుప్పట్లు అందజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెకండ్ వైస్ ప్రెసిడెంట్ మంచాల ఎల్లయ్య,ప్రధాన కార్యదర్శి అంచూరి యుగంధర్, జీటీఓ కోఆర్డినేటర్ రొద్ద రాజు, ఎల్ఈఓ కోఆర్డినేటర్ బైరి వెంకటేశ్వర్లు, పీఆర్ఓ భువనగిరి శ్రవణ్ కుమార్, ప్రతినిధులు బజ్జూరి సంతోష్ కుమార్, పాలకుర్తి నాగార్జున్ పాల్గొన్నారు. సీఏసీఎస్ సెక్రటరీ వెంకన్న, ఐకేపీ సెంటర్ ఇన్‌చార్జ్ కందిక రాజు, దివీటిపల్లి వార్డు సభ్యుడు కంజర్ల దయాకర్, రైతులు గోపాల్, యాదవ రెడ్డి, రామ్ రెడ్డి, గ్రామస్తులు హాజరయ్యారు. లయన్స్ క్లబ్ సేవలను హమాలీలు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

## మధ్యాహ్నం 12కే తాళం పడ్డ పీహెచ్‌సీ

### చింతనెక్కొండలో వైద్య సిబ్బందిపై ప్రజాగ్రహం



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 12**

వరంగల్ జిల్లా: పర్వతగిరి మండలం చింతనెక్కొండ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకే తాళం పడింది. అత్యవసర వైద్యం కోసం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటంతో వైద్యురాలు నవ్య కృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఉపకేంద్రానికి తాళం వేసి ఉండటంతో రోగులు,వారి బంధువులు గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. విషయం తెలుసుకుని ఉపకేంద్రం వైద్యురాలు నవ్య కృష్ణకు ఫోన్ చేయగా," నేను భోజనానికి వెళ్లాను. ఏఎన్ఎం రజిత ఫీల్డ్‌లో ఉన్నారు. ఆశా వర్కర్‌కు చెప్పి కేంద్రం ఓపెన్ చేయిస్తాను" అని బదులిచ్చారు. ఏఎన్ఎం రజితను సంప్రదించగా,"నేను ఫీల్డ్‌లో ఉన్నాను. మేడం సెలవులో ఉన్నారు. ఆశా వర్కర్ ద్వారా పల్లె దవాఖాన తెరిపిస్తాను"అని చెప్పారు. చివరకు దాదాపు మూడు గంటల తర్వాత ఆశా వర్కర్ వచ్చి ఉపకేంద్రం తాళం తీసింది.వైద్యాధికారి స్పందన

ఈ ఘటనపై వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ రాజ్‌కు తాళం వేసిన ఫోటోలు పంపి వివరణ కోరగా, "చింతనెక్కొండ ఉపకేంద్ర సిబ్బందిపై విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తాం. వారి సూచనల మేరకు తగిన చర్యలు తీసుకుంటాం" అని ఆయన తెలిపారు. ప్రభుత్వ సమయం ముగియకముందే ఆరోగ్య కేంద్రానికి తాళం వేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## మొక్కజొన్న కొనుగోళ్లు మిషన్ మోడ్‌లో జరగాలి:

### కలెక్టర్ రాహుల్ శర్మ పకడ్బందీ ప్రణాళిక

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**





జిల్లాలో మొక్కజొన్న సాగు చేసిన ప్రతి రైతుకు మద్దతు ధర దక్కేలా, కొనుగోలు ప్రక్రియను అత్యంత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన రేగొండ మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని, మొగుళ్లపల్లి మండలంలోని మార్కెట్ కమిటీ గోదాములను స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ ఏడాది 49,528 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని, ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 2,400 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1.30 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేయగా, అందులో ప్రభుత్వం ద్వారా 45 వేల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యంగా 12 ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇప్పటివరకు 26,000 మెట్రిక్ టన్నుల పంట కేంద్రాలకు రాగా, అందులో 16,850 మెట్రిక్ టన్నుల కొనుగోలు పూర్తయ్యిందని వెల్లడించారు. గోదాముల కొరతను అధిగమించేందుకు కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. జమ్మికుంట, జల్లేడుకుంట ప్రాంతాలలో 7,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములను యుద్ధ ప్రాతిపదికన అందుబాటులోకి తెచ్చారు. వీటితో పాటు జిల్లాలోని రెండు ప్రముఖ జిన్నింగ్ మిల్లులను కూడా మొక్కజొన్న నిల్వ కోసం కేటాయించినట్లు తెలిపారు.ప్రస్తుతం జిల్లాలో 16,912 మెట్రిక్ టన్నుల నిల్వ స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ, పెరుగుతున్న పంట రాకను దృష్టిలో ఉంచుకుని మార్కెట్ యార్డులు, సహకార సంఘాలలోని చిన్న గోదాములను





కూడా వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖకు అనుమతి ఇచ్చారు. హమాలీల కొరత వల్ల అన్‌లోడింగ్‌లో జాప్యం జరగకుండా ఉండేందుకు, ప్రభుత్వం కూలి రేటును బ్యాగ్‌కు రూ. 6.50 నుండి రూ. 8.50కు పెంచిందని,స్థానిక హమాలీలను పెద్ద సంఖ్యలో వినియోగించుకుని రోజువారీ కొనుగోలు సామర్థ్యాన్ని పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం 3.37 లక్షల గన్నీ సంచులు అందుబాటులో ఉన్నాయని, రవాణా కోసం అవసరమైన వాహనాలను కార్మికుల లభ్యతకు అనుగుణంగా సర్దుబాటు చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నీడ వంటి వసతులు కల్పించాలని, వర్షాల సూచనల నేపథ్యంలో టార్పాలిన్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా సహకార అధికారి వాలియానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. పంట కొనుగోలులో జాప్యం చేసే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా ట్యాబ్ ఎంట్రీలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పోలీస్ స్టేషన్లలో పారదర్శక సేవలే లక్ష్యం..

### వార్షిక తనిఖీల్లో భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ యంత్రాంగం పనితీరును మరింత మెరుగుపరచడం,ప్రజలకు మరింత చేరువగా సేవలందించడం లక్ష్యంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ మంగళవారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్,సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయాన్ని సందర్శించి వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయన పోలీస్ స్టేషన్ ఆవరణలో 'వన మహోత్సవం' కార్యక్రమంలో భాగంగా ఒక మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో పోలీస్ శాఖ తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తుందని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, విధులతో నిరంతరం ఒత్తిడికి గురయ్యే సిబ్బంది మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కోసం స్టేషన్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టును ఆయన ప్రారంభించారు. అనంతరం ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ,పరిసరాల పరిశుభ్రత ఆయుధ సామాగ్రిని నిశితంగా పరిశీలించారు. ప్రతి కేసు ఫైల్ ను క్షుణ్ణంగా తనిఖీ చేసి, దర్యాప్తులో జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు, పాత కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.



ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధుల సమస్యల పట్ల అత్యంత సున్నితంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే సామాన్య ప్రజలకు అది తమ సొంత ఇల్లు అనే భావన కల్పించేలా 'ఫ్రెండ్లీ పోలీసింగ్' పద్ధతులను పాటించాలని, పారదర్శకమైన సేవలతో ప్రజల నమ్మకాన్ని చూరగొనాలని ఆయన దిశానిర్దేశం చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తూనే, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా కృషి చేయాలని ఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ స్థాయి అధికారులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య రంగంలో నర్సుల సేవలు వెలకట్టలేనివి

### జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్








**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జి జి హెచ్)లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా నర్సింగ్ వృత్తికి విశేష గౌరవాన్ని కల్పించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. రోగుల సంరక్షణలో, ప్రజారోగ్య వ్యవస్థలో నర్సింగ్ ఆఫీసర్లు వెన్నెముక వంటివారని కొనియాడారు. ఆసుపత్రిలో పుట్టిన ప్రతి శిశువును తల్లి కంటే ముందుగా ముద్దాడే గొప్ప మనసు నర్సులకే ఉంటుందని ఆయన భావోద్వేగంగా పేర్కొన్నారు. రోగికి మానసిక ఓదార్పునిస్తూ, ధైర్యాన్ని నూరిపోస్తూ, 24 గంటల పాటు అందుబాటులో ఉండి కంటికి రెప్పలా కాపాడే నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఆయన ప్రశంసించారు. ప్రజల ఆరోగ్య రక్షణలో నర్సింగ్ అధికారులు అందిస్తున్న నిరంతర తోడ్పాటును ఈ సందర్భంగా హాస్పిటల్ యాజమాన్యం ప్రత్యేకంగా గుర్తుచేసుకుంది. రోగం నయమై రోగి క్షేమంగా ఇంటికి వెళ్లే వరకు వారు చేసే సేవలు వెలకట్టలేనివని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వేంకటరత్నం, డాక్టర్ రాజేష్, డాక్టర్ నాగ శశికాంత్ పాల్గొని నర్సులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితో పాటు నర్సింగ్ సూపరింటెండెంట్లు ఉమేశ్వరి, జెస్సి బ్యూలా, జయలక్ష్మి, స్వర్ణలత, పెద్ద సంఖ్యలో నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## స్టేషన్ ఘనపూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో క్యాంటీన్‌కు తాళం

-అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో చర్య

-మరో నెల గడువు ఇచ్చిన ఆర్టీసీ అధికారులు




**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ మే12**

జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న క్యాంటీన్‌ను ఆర్టీసీ అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. క్యాంటీన్ నిర్వాహకుడు గత ఐదు నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే రెండు నెలలుగా పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ అద్దె చెల్లించకపోవడం వల్ల తాళం వేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.



ఈ నేపథ్యంలో క్యాంటీన్ నిర్వాహకుడు మరో నెల రోజుల గడువు కోరినట్లు సమాచారం. అయితే, ఆ గడువులోపల అద్దె చెల్లించకపోతే కాంట్రాక్టును పూర్తిగా రద్దు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. సీనియర్ అసిస్టెంట్ శ్రవంతి ఆధ్వర్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

## వధూవరులను ఆశీర్వదించిన బంజారా సంక్షేమ సంఘాల నాయకులు

**తెలుగు గళం న్యూస్ హుజూరాబాద్**



హుజూరాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బర్మావత్ రమ-యాదగిరి కుమారుడు బర్మావత్ వెంకటేష్ వివాహ రిసెప్షన్ వేడుక మంగళవారం హుజూరాబాద్ పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ శుభకార్యానికి బంజారా వెల్ఫేర్ అసోసియేషన్,వివిధ లంబాడీ ఐక్యవేదికల ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.ఎన్. నాయక్,లంబాడీల ఐక్యవేదిక (లైవ్) ఉమ్మడి జిల్లా అధ్యక్షులు లావుడియా పల్లవి రాజు నాయక్, సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షులు చినబాబు నాయక్ తదితరులు విచ్చేసి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో మాజీ ఎంపీటీసీ బాదావత్ సోము నాయక్, డాక్టర్ పోరిక రమేష్ నాయక్,సేవాలాల్ సేన హన్మకొండ జిల్లా అధ్యక్షులు కునుసోతు మురళి నాయక్ కూడా పాల్గొని వధూవరులను దీవించారు. వీరితో పాటు వివిధ కుల సంఘాల నాయకులు, రాజకీయ ప్రముఖులు, బంధుమిత్రులు భారీగా తరలివచ్చి వేడుకను సందర్శించారు. మాజీ మార్కెట్ చైర్మన్ కుటుంబ సభ్యులు వచ్చిన అతిథులకు ఘన స్వాగతం పలికారు. హుజూరాబాద్ ప్రాంతంలోని బంజారా వర్గాల ప్రముఖులు ఒకే వేదికపై కలిసిన ఈ కార్యక్రమం ఎంతో సందడిగా సాగింది.

## పుష్కర ఏర్పాట్లను ఈ నెల 15 లోపు పూర్తి చేయాలి:

## ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కాళేశ్వరం



ఈ నెల 21వ తేదీ నుండి జూన్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విద్యుత్ ఏర్పాట్లను ఈ నెల 15వ తేదీ లోపు పూర్తి చేయాలని తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాళేశ్వరం సందర్శించిన ఆయన, పుష్కర ఘాట్లు, బస్టాండ్ ప్రాంతం, పార్కింగ్ ఏరియా, భక్తులు అధికంగా రాకపోకలు సాగించే ప్రదేశాలలో జరుగుతున్న విద్యుత్ పనులను స్వయంగా పరిశీలించారు.



తాత్కాలిక విద్యుత్ లైన్ల ఏర్పాటు, స్ట్రీట్ లైటింగ్, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం తీసుకుంటున్న భద్రతా చర్యలపై క్షేత్రస్థాయి అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు నిరంతరాయంగా, సురక్షితంగా విద్యుత్ అందించేందుకు ఎన్పీడీసీఎల్ ప్రత్యేక కార్యాచరణతో సిద్ధంగా ఉందని తెలిపారు. విద్యుత్ పనులలో మెజారిటీ భాగం ఇప్పటికే పూర్తయ్యాయని, మిగిలిన స్వల్ప పనులను నిర్ణీత గడువులోగా ముగించాలని స్పష్టం చేశారు. పుష్కరాల సమయంలో ఎటువంటి ఆకస్మిక విద్యుత్ అంతరాయాలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక సాంకేతిక బృందాలను నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. భక్తుల రద్దీ దృష్ట్యా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, విద్యుత్ భద్రతా ప్రమాణాలను తూచా తప్పకుండా పాటిస్తూ ఎక్కడా ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్త వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యవేక్షణలో సీఎండీ వెంట సీఈ రాజు చౌహాన్, ఎస్ఈ ములుగు బేతి బిక్షపతి, కాటారం డీఈ ఆపరేషన్ నాగరాజు, డీఈ టెక్నికల్ జగదీశ్, డీఈ (ఎంఆర్టీ & సి) సదానందం తదితరులు పాల్గొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి పనుల నాణ్యతను పర్యవేక్షించాలని ఈ సందర్భంగా సీఎండీ దిశానిర్దేశం చేశారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం లేక కన్నీరు పెడుతున్న కర్షకులు

### పంకెనలో తక్షణమే సెంటర్ ఏర్పాటు చేయాలి

### రైతు సంఘం జిల్లా నాయకుడు అక్కల బాపు యాదవ్

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి పలిమెల

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండల కేంద్రంతో పాటు పంకెన గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని రైతు సంఘం జిల్లా నాయకుడు అక్కల బాపు యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పలిమెలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అప్పులు తెచ్చి ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చినా, అమ్ముకోవడానికి దిక్కుతోచని స్థితిలో రైతన్నలు ఉన్నారని పేర్కొన్నారు. పంకెన గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పి ఎ సి ఎస్) లేదా ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని కల్లాల్లోనే ఆరబోసి రోజుల తరబడి వేచి చూస్తున్నారని, అకాల వర్షాల భయంతో కుప్పలపై పరదాలు కప్పి రాత్రింబవళ్లు పహారా కాస్తున్నారని ఆయన తెలిపారు. వర్షానికి గింజ తడిసి రంగు మారితే మద్దతు ధర దక్కదని భయాందోళన చెందుతున్నారని, ఇదే అదనుగా ప్రైవేటు వ్యాపారులు, దళారులు తక్కువ ధరకే ధాన్యాన్ని అడుగుతూ రైతులను దోపిడీ చేస్తున్నారని బాపు యాదవ్ వాపోయారు. పక్క గ్రామాల్లోని కేంద్రాలకు వెళ్తే అక్కడ రద్దీ ఎక్కువగా ఉండటంతో వారాల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, రవాణా ఖర్చులు భరించలేక అన్నదాతలు ఆర్థికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలిమెల, పంకెన గ్రామాల్లో వెంటనే పీఏసీఎస్ లేదా ఐకేపీ సెంటర్లను ప్రారంభించాలని, ధాన్యం సేకరణలో జాప్యం లేకుండా సరిపడా గన్నీ బ్యాగులు, రవాణా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే తేమ శాతం పేరుతో కోతలు విధించకుండా ప్రభుత్వ మద్దతు ధరను పూర్తిస్థాయిలో చెల్లించాలని కోరారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు స్పందించి పంకెన గ్రామ రైతుల కష్టాలను తీర్చాలని, యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయని పక్షంలో రైతులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన బాట పడతామని అక్కల బాపు యాదవ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు రైతులు, రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



# రాజ్యసభ సభ్యునికి ఘన సన్మానం

**రాజ్యసభసభ్యునిగా ఎన్నికైన అనంతరం తొలిసారి కురవి మండల కేంద్రంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామివారి ఆలయానికి వచ్చిన వేం నరేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించిన టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్.**

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.



మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా ఉన్న జర్నలిస్ట్ ల సమస్యల పరిష్కారంపై ప్రత్యేకదృష్టి నిలపాలని, దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా ఉన్న జర్నలిస్ట్ ల డిమాండ్ లను నెరవేర్చడంలో, ప్రభుత్వంలో అత్యున్నత స్థాయిలో ఉన్న మీరు.., మహబూబాబాద్ జిల్లావాసిగా మన జిల్లా జర్నలిస్టుల కలలను సాకారం చేయాలని కోరిన టియుడబ్ల్యూజ ే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్. కురవి దేవాలయ అభివృద్ధికోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ప్రత్యేకంగా చర్చించి కలకాలం గుర్తుండేలా రూ.50కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని రాజ్యసభసభ్యులు వేం నరేందర్ రెడ్డి ని కోరిన టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్. సానుకూలంగా స్పందించిన యంపి వేం నరేందర్ రెడ్డి., ప్రతి అంశాన్ని ప్రత్యేకంగా చర్చిద్దామని, మహబూబాబాద్ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అభివృద్ధి కి తనవంతు సహకారం తప్పకుండా ఉంటుందన్న యంపి వేం నరేందర్ రెడ్డి, ఆయన వెంట ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్, మహబూబాబాద్ యంపి బలరాంనాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్, డిసిసి అధ్యక్షురాలు డాక్టర్ ఉమామురళీనాయక్, మహబూబాబాద్ జిల్లా గ్రంధాలయసంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి, కురవి ఆలయ చైర్మన్ కొర్ని రవీందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్ తదితరులు ఉన్నారు.



# నూతన ఆలయానికి శంకుస్థాపన

## టీలావత్ తండాలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ శంకుస్థాపన





తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

మరిపెడ మండలం గాలివారిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని టీలావత్ తండాలో శ్రీ అభయాంజనేయ స్వామి వారి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గాలివారిగూడెం సర్పంచ్ నారెడ్డి కవితా – సుదర్శన్ రెడ్డి దంపతులు తమ సొంత ఖర్చులతో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్చారణల నడుమ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించగా గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయ నిర్మాణం పూర్తయిన అనంతరం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవనుందని గ్రామ పెద్దలు తెలిపారు. సర్పంచ్ కవితా మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆధ్యాత్మిక అభివృద్ధి కోసం ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు సహకరించి ఆలయ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

## రోడ్డు భద్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి





తెలుగు గళం న్యూస్ జనగామ మే12

మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎక్సైజ్, పోలీసు, వైద్య శాఖల అధికారులతో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్ల పరిధిలో మత్తు పదార్థాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు దాబాల వద్ద తనిఖీలు కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. యువత మత్తుకు బానిస కాకుండా, తమ ఉజ్వల భవిష్యత్తును కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గుట్కా విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ ఎస్పీ అనిత, ఆర్టీఓ శ్రీనివాస్ గౌడ్, డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.అనంతరం జరిగిన సమావేశంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు భద్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి నిర్వహించిన రహదారి భద్రత సమీక్ష సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జిల్లాలోని రెండు నేషనల్ హైవేలపై రెండు లేన్ రోడ్డు పనులను వేగవంతం చేయాలని, గ్రామాల్లో రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. ప్రధాన రహదారుల వద్ద వీధి వ్యాపారాలను నియంత్రించి ప్రత్యేక వెండింగ్ జోన్లు ఏర్పాటు చేయాలని, రాత్రి సమయంలో సరిపడా లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాద ప్రదేశాల్లో "గో స్లో" హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అత్యవసర సమయంలో ఈఎంఆర్ఐ 108 సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల వద్ద హనుమాన్ ఆలయం దగ్గర రంబుల్ స్ట్రిప్స్, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలని, పాలకుర్తి, వావిలాల క్రాస్ వద్ద రోడ్డు విస్తరణ చేపట్టాలని, పెంబర్తి యూ-టర్న్ వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డబీ అధికారులు, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, నేషనల్ హైవేస్ అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వరి,మక్కల కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

రాష్ట్రంలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సస్పెండ్ చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం మిషన్ మోడ్‌లో పనిచేయాలని ఆదేశించారు.ప్రతి ప్రైవేట్ గోదామును, కమ్యూనిటీ హాళ్లను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని,రైస్ మిల్లుల వద్ద తరుగు పేరుతో కోతలు విధిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇప్పటివరకు రూ. 3,873 కోట్లను రైతులకు విడుదల చేశామని సీఎం తెలిపారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. యాసంగిలో భారీగా వచ్చిన మొక్కజొన్న దిగుబడిని సజావుగా కొనుగోలు చేయాలని, ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం, మక్కలు తెలంగాణలోకి రాకుండా సరిహద్దుల్లో విజిలెన్స్ పెంచాలని ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం ప్రభుత్వం రూ.4,178 కోట్లను ఆమోదించిందని, హమాలీ చార్జీలను ఒక్కో సంచికి రూ.8.50కు పెంచామని వివరించారు. మరో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో ధాన్యం సేకరిస్తోందని, ఈ నెలాఖరులోగా సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అకాల వర్షాల నుండి పంటను కాపాడేందుకు ప్రతి ఐకేపీ కేంద్రానికి ప్రత్యేక అధికారిని నియమించాలని, టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ధాన్యం, మక్కల కొనుగోళ్లు సజావుగా సాగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. లారీల కొరత ఉన్నచోట ట్రాక్టర్లను, స్థానిక హమాలీలను వినియోగించుకోవాలని సూచించారు. చెక్ పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉంచి ఇతర రాష్ట్రాల ధాన్యం రాకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సహకార అధికారి వాలియా నాయక్, వ్యవసాయ అధికారి బాబు రావు, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, డీఆర్‌డీఓ బాలకృష్ణ, జిల్లా రవాణా శాఖ అధికారి సాందని తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సహాయనిధి పేదలకు వరం వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

**తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే12**

సీఎం సహాయనిధి పేదలకు ఓ వరం లాంటిదని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు రూ.6 లక్షల 33 వేల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక అవసరాలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందుతున్నదని తెలిపారు. అర్హులైన వారు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం నుంచి సహాయం అందుతుందని చెప్పారు.ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నారని ఎంపీ పేర్కొన్నారు. ప్రతి అర్హుడూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ డా. కడియం కావ్య కోరారు.











# ప్రభుత్వ ధాన్యం దిగుమతిలో రైస్ మిల్లర్లు ప్రాధాన్యత ఇవ్వాలి-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**తెలుగు గళం న్యూస్ జనగామ మే12**



జిల్లాలోని రైస్ మిల్లర్లు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడంలో ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మిల్లుల వారీగా ఇప్పటివరకు దిగుమతి చేసిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, లక్ష్యాల మేరకు వేగవంతంగా దిగుమతులు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. రబీ సీజన్ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద లారీల దిగుమతిలో ఆలస్యం జరిగితే సహించబోమని స్పష్టం చేశారు. మిల్లులకు చేరుకున్న ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసి, లారీలను తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అవసరమైతే అదనపు హమాలీలను నియమించి దిగుమతిని వేగవంతం చేయాలని, ప్రతి మిల్లులో నియమిత అధికారులు కచ్చితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఓపీఎంఎస్ నమోదు, మిల్లర్ల ధృవీకరణ ప్రక్రియలు పెండింగ్‌లో లేకుండా సమయానికి పూర్తి చేయాలని పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రతి మిల్లును సందర్శించి దిగుమతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ధాన్యం రవాణాలో నిర్లక్ష్యం చూపే లారీ డ్రైవర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఒక కేంద్రానికి కేటాయించిన లారీ అదే కేంద్రానికి వెళ్లేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని తెలిపారు.





అదేవిధంగా ధాన్యం నిల్వ సమస్యలు తలెత్తకుండా తాత్కాలిక నిల్వ గోదాములు (ఇంటర్మీడియట్ గోదాములు) ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ డీఎం హతిరామ్, జిల్లా మార్కెటింగ్ అధికారి రామకృష్ణ, ఇంచార్జి డీసీఎస్ఓ సురేష్ రెడ్డి, ఏపీడీ నూరుద్దీన్, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్ తన వైఖరి మార్చు కోవాలి....

## జనగామ జిల్లా అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం లో ఏకగ్రీవ తీర్మానం...



**తెలుగు గళం న్యూస్ జనగామ మే12**

జనగామ పట్టణంలో స్థానిక విజయ ఫంక్షన్ హాల్ లో జిల్లా పార్టీలు, ప్రజాసంఘాలు సంయుక్తం గా జిల్లా కలెక్టర్ నియంత్రుత్వ వైఖరి పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమం లో జనగామ లోని కార్మిక, కర్షక లారీ, ట్రాక్టర్, భవన నిర్మాణ కాంట్రాటర్లు, మాజీ, ప్రస్తుత కౌన్సిలర్ లు పాల్గొని కలెక్టర్ వ్యవహార శైలిని తప్పు పట్టారు. ఈ సందర్భంగా వనితా టీ స్టాల్ నడుపుతున్న దళిత మహిళ పలమకుల మంజుల తన టీ స్టాల్ ను ఎటువంటి కనికరం లేకుండ తొలగించి తన జీవన భృతిని ఏవిదంగా ధ్వంసం చేసాడో చెబుతూ కన్నీరు పెట్టుకుంది. తన టీ స్టాల్ ను గత కలెక్టర్ మంజూరు చేసి అదే స్థానం లో విద్యుత్ కనెక్షన్ ఇచ్చి తనకు సహాయపడితే ఈ కలెక్టర్ పేదరాలు నైనా నన్ను పట్టించుకోకుండ కాళ్ళు మొక్కినా కూడ వదలకుండా వాస్తు పేరు చెప్పి, తన తల్లి తీయమంది అని చెప్పి మున్సిపల్ కమిషనర్ ద్వారా తొలిగిస్తే మున్సిపల్ చైర్మన్ మహిళ అయి ఉండి కూడ దళిత మహిళకు ఈ సహాయం చేయలేదని వాపోయింది. ఈ విషయం లో ఇద్దరు మహిళా కౌన్సిలర్ లు ఈ విషయం పై కౌన్సిల్ లో చర్చ పెట్టమని కోరినా మున్సిపల్ చైర్మన్ ఏమి చేయలేదని ఆమె ఆవేదన వెలిబుచ్చింది. మాజీ కౌన్సిలర్ కత్తుల రాజి రెడ్డి మాట్లాడుతూ గత 6 సంవత్సరాల నుండి వ్యవసాయ శాఖ నుండి 17 లక్షల బకాయిలు రావ యుండగా వాటి విషయం లో జిల్లా కోర్ట్ వ్యవసాయ శాఖ కార్యాలయం జప్తు చేయమని ఆదేశాలు జారీ చేయగా అట్టి ఆదేశానుసారము కోర్టు సిబ్బంది జిల్లా వ్యవసాయ కార్యాలయమును సందర్శించినప్పుడు కలెక్టర్ అడ్డుకొని వారిని కోప్పడి తన కార్యాలయములో జప్తులు చేయవద్దని వారిని దూషించి పంపారని ఇట్టి విషయమై హైకోర్టులో కేసు విచారణలో వుందని రాజి రెడ్డి తెలిపారు. అంతే గాకుండా ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యక్తిగతంగా తనపై కక్ష పెంచుకొని ఆర్.డి.ఓ అధ్యక్షతన తన వ్యాపారాన్ని మూయించడానికి 8 ప్రభుత్వ శాఖల ద్వారా విచారణ చేయిస్తున్నాడని ఆవేదన వెలిబుచ్చారు. ట్రాక్టర్ల యజమానుల సంఘం జిల్లా నాయకుడు ఆకుల లక్ష్మయ్య మాట్లాడుతూ భవన కార్మికులకు ముఖ్యంగా ఇసుక అవసరమని అయితే లారీల ద్వారా పెద్ద మొత్తంలో ఇసుక లభిస్తుందని తక్కువ మొత్తం కావలసిన యజమానులు ట్రాక్టర్ల ద్వారా లారీల నుండి తోడుకొని సరఫరా చేస్తారని ఇట్టి విధానాన్ని తప్పు పట్టి జిల్లా కలెక్టర్ లక్షల రూపాయల జరిమానా వేసి ట్రాక్టర్ యజమానులను, డ్రైవర్లను ఉపాది లేకుండా ఉపవాసాలు పడుకోబెడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మట్టి కూడా సరఫరా చేయకుండా లక్షల రూపాయలు జరిమానాలు వేస్తున్నాడని అనేక నిబంధనలు పెట్టి అసలు భవన నిర్మాణాలు కుంటుపడేలా వ్యవహరిస్తున్నాడని ఇలా చేస్తే కాంగ్రేస్ ప్రభుత్వానికి నష్టం జరుగుతుందని తాను కాంగ్రేస్ కార్యకర్తనై యుండి ఏమి చేయలేక పోతున్నానని వాపోయారు. సాధిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ మాట్లాడుతూ పోరాడి తెచ్చుకున్న జిల్లాలో ప్రజలందరు జిల్లా కలెక్టర్ వ్యవహార శైలి వల్ల నష్ట పోతున్నారని కాంగ్రేస్ నాయకులు చూస్తూ కూర్చోవడం వల్ల వారు ఇక ఎప్పుడు జిల్లా లో ఓట్లు అడిగే అర్హతను కోల్పోతారని అన్నారు. బీహార్ కు చెందిన ఐ.ఏ.ఎస్ ఆఫీసర్లను గత ప్రభుత్వంలో ఈ తెలంగాణ కు పట్టిన చీడ గా వర్ణించిన ఈ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు ఈ కలెక్టర్ ను జనగామ ప్రజలను హింసించడానికి పంపడం ఎంతవరకు న్యాయం అని ఆయన ప్రశ్నించారు. జిల్లా ప్రజలు ఏకమై ఈ కలెక్టర్ వ్యవహారము పై ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నారని అన్ని పార్టీల వారు కలిసి వస్తే వారికి పుట్టగతులు ఉంటాయని లేకుంటే జనగామ ప్రజలు కలెక్టర్ ను పంపే ప్రక్రియలో కలిసి రాని పార్టీలను సమాధి చేస్తారని ఆయన తెలిపారు. జిల్లా కాంగ్రేస్ పార్టీ ఇప్పటికైనా కండ్లు తెరచి జనగామ ప్రజలను వేధిస్తున్న జిల్లా కలెక్టర్ ను బదిలీ చేయించాలని లేకుంటే వారే ప్రజలకు సమాధానము చెప్పుకోవలసి ఉంటుందని అన్నారు. విజయ డైరీ పార్లర్ పెట్టుకున్న విజయలక్ష్మి మాట్లాడుతూ తన స్టాల్ ను కూడా జిల్లా కలెక్టర్ ఎటువంటి కనికరం లేకుండా తీసి వేసాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో ట్రాన్స్ పోర్టు సంఘం నాయకులు గొంగళ్ల రామక్రిష్ణ మాట్లాడుతు ఇసుక తక్కువ మొత్తం లో సరఫరా చేసే తమకు ఉపాది లేకుండా జిల్లా కలెక్టర్ చేయడం వల్ల వందలాది మంది తన వంటి ఆటో ట్రాలీ కార్మికులు రోడ్డున పడ్డారని తమ బ్రతుకు వెళ్ళబుచ్చడం కష్టంగా మారిందని ఆందోళన వెలిబుచ్చారు.న్యాయవాది రాగల్ల్ శ్రీహరి మాట్లాడుతూ తాము కేసులు వాదించడానికి కలెక్టరేట్ కు వెళితే తమ వాహనాలను ఒక కిలోమీటర్ దూరంలోనే ఆపి మండుటెండలో నడుచుకుంటూ రావాలని ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ పై ప్రభుత్వ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ చివరకు పత్రికా ప్రతినిధులను కూడా వదిలిపెట్టకుండా హింసిస్తున్నాడని హైదరాబాద్ నుండి ఎవరో వ్యక్తిని తెచ్చి అక్రిడియేషన్ కమిటిలో వేసి పత్రికా విలేఖరులను చులకన చేస్తున్నాడని మరియు వారి వాహనాలను కూడా జిల్లా కలెక్టర్ కార్యాలయమునకు రాకుండా నిరోదించి వారిని తీవ్ర అవమానాల పాలు చేస్తున్నాడని పత్రికా విలేఖరుల సంఘం జిల్లా నాయకులు పారనంది వెంకటస్వామి తెలిపారు. 3వ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి మాట్లాడుతూ తాను రెండు సార్లు తన వార్డు లోనే జిల్లా కలెక్టర్ కార్యాలయము ఉన్నందున అనేక విషయాలు తెలుపడానికి కార్యాలయానికి జిల్లా కలెక్టర్ ను కలువడానికి వెళ్ళగా తాను కలువనని తన చిట్టీని వెనక్కి పంపాడని ఒక మహిళ ప్రజా ప్రతినిధిని అవమానపరచిన జిల్లా కలెక్టర్ పై తక్షణమే చర్య తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమములో సి.పి.యం. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, టి.ఆర్.పి. పార్టీ జిల్లా అధ్యక్షులు కట్ల సదానందం, జె.యం.ఐ రాష్ట్ర కన్వీనర్ కన్నారపు పరశురాములు, టి.ఆర్.యస్. (కవిత) పార్టీ జిల్లా నాయకులు అనంతుల ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ తన వైఖరిని 20 రోజులలోపు మార్చుకోకపోతే అన్ని పార్టీలు కలిసి రాజకీయాలకు అతీతంగా ఈ రౌండ్ టేబుల్ తీర్మాణానికి కట్టుబడి పోరాటం చేయాలని తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశములో సి.ఐ.టి.యు జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సింగారపు రమేష్, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు మల్లిగారి రాజు, సి.పి.యం. సీనియర్ నాయకులు యం.డి. దస్తగీర్, అవాజ్ జిల్లా కార్యదర్శి యం.డి. అజహర్, రజక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కొలిపాక నర్సింహులు, చేతి వృత్తి దారుల సమన్వయ కమిటి జిల్లా కన్వీనర్ బూడిద గోపి, సిపిఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు పజ్జూరి జయహరి, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ ప్రతినిధులు కాసాని ఉపేందర్, జాల రమేష్, తిప్పారపు ఉపేందర్, జితేందర్, ఉల్లెంగుల మణికుమార్, ఎండబట్ల భాస్కర్ ఆశిష్, పల్లేరుల లలిత, పొత్కనూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.






# అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం

# మొక్కలను కాపాడుకోవటమే ప్రస్తుత కర్తవ్యం

● మొక్కలే జీవావరణానికి మూలం ● మానవ కృత్యాలే మొక్కల అనారోగ్యానికి మూలం ● మొక్కల ఆరోగ్యంపై శాస్త్రీయ దృక్పథంలో విశ్లేషణ

● అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం 2026 ● తెలుగు గళం న్యూస్ ప్రత్యేక కథనం




మొక్కలు మన గ్రహం యొక్క ఊపిరితిత్తులు, జీవనాధారం. మనం పీల్చే ఆక్సిజన్‌లో 98% మరియు మనం తినే ఆహారంలో 80% మొక్కల నుండే లభిస్తాయి. ఈ కీలకమైన మొక్కల ఆరోగ్యాన్ని కాపాడటం ద్వారా ఆకలిని తగ్గించడం, పేదరికాన్ని నిర్మూలించడం, జీవవైవిధ్యాన్ని రక్షించడం, ఆర్థికాభివృద్ధిని పెంపొందించడం వంటి లక్ష్యాలతో, ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం మే 12ను అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవంగా (ఇంటర్నేషనల్ డే అఫ్ ప్లాంట్ హెల్త్ – ఐ.డి.పి.హెచ్) జరుపుకుంటుంది. 2026లో కూడా "మొక్కలను రక్షించడం, జీవనాన్ని రక్షించడం" (ప్రొటెక్టింగ్ ప్లాంట్స్, ప్రొటెక్టింగ్ లైఫ్) అనే ముఖ్య ఉద్దేశ్యంతో, తెగుళ్లు, వ్యాధుల నుండి మొక్కలను సంరక్షించడంపై ప్రపంచవ్యాప్త అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం నిర్వహించబడుతుంది. 2026 మొక్కల ఆరోగ్య దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలు ఆహార భద్రత. ప్రపంచ ఆహార భద్రత ప్రతి సంవత్సరం 40% ఆహార పంటలు మొక్కల తెగుళ్ల వల్ల నష్టపోతున్నాయి. వీటిని తగ్గించడం. పర్యావరణ పరిరక్షణ లోభాగంగా వాతావరణ మార్పుల నుండి ప్రకృతిని, జీవవైవిధ్యాన్ని రక్షించడం. ఒకదేశ ఆర్థికాభివృద్ధి ఆదేశాజంలోని మొక్కల వ్యాధుల వల్ల కలిగే వి220 బిలియన్లకు పైగా నష్టాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని సుస్థిరం చేయడం జరుగుతుంది. మొక్కల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం అంటే మన భవిష్యత్తును మనం కాపాడుకోవడమే.

## అనంత విశ్వంలో భూమి -- జీవానికి ఆధారమైన ఏకైక గృహం:

అనంతమైన విశ్వంలో జీవరాశి విలసిల్లుతున్న ఏకైక గ్రహం భూమి మాత్రమే కావడం వెనుక ఒక అద్భుతమైన శాస్త్రీయ సమతుల్యత దాగి ఉంది. సూర్యుడు ఈ భూమికి ప్రధాన శక్తి వనరుగా నిలవగా, ఆ సూర్యరశ్మిని గ్రహించి కిరణజన్య సంయోగక్రియ (ఫోటోసింతసిస్) ద్వారా ఆహారంగా, ప్రాణవాయువుగా మార్చగలిగే శక్తి కేవలం మొక్కలకు మాత్రమే ఉంది. మొక్కలు కార్బన్ డయాక్సైడ్, నీటిని ఉపయోగించుకుని గ్లూకోజ్‌ను తయారు చేస్తూ, సమస్త జీవరాశికి అవసరమైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. ఈ క్రమంలో మొక్కలు "ప్రాథమిక ఉత్పత్తిదారులు"గా వ్యవహరిస్తూ, ప్రతి ఆహార గొలుసు (ఫుడ్ చైన్) కు పునాదిగా నిలుస్తున్నాయి; అంటే మనం తినే శాకాహారం నుండి, పరోక్షంగా లభించే మాంసాహారం వరకు ప్రతిదీ మొక్కల నుంచే మొదలవుతుంది. ఒకవేళ మొక్కలు లేకపోతే ఆహార ఉత్పత్తి ఆగిపోవడమే కాకుండా, వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ పెరిగి భూమి వేడిక్కెడం (గ్లోబల్ వార్మింగ్),ఆక్సిజన్ కొరత ఏర్పడి మొత్తం జీవవ్యవస్థే కూలిపోతుంది. సూర్యరశ్మి, మొక్కలు,ఆహారం, ఆక్సిజన్ అనేవి ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న జీవన సూత్రాలు. కాబట్టి, భూమిపై జీవం నిలబడాలన్నా, భవిష్యత్ తరాలకు సురక్షితమైన పర్యావరణం అందాలన్నా మొక్కలను కాపాడటం అనేది మనందరి ప్రాథమిక బాధ్యత;ఎందుకంటే మొక్కలు లేని భూమిపై మనుగడ అనేది అసాధ్యం.



## మొక్కల ఆరోగ్యం -- జీవావరణానికి మూలస్తంభం:

జీవావరణం (ఏకోసిస్టం) లో మొక్కలు ప్రాథమిక ఉత్పత్తిదారులు (ప్రైమరీ ప్రొడ్యూసర్స్) గా కీలక పాత్ర పోషిస్తాయి. కిరణజన్య సంయోగ క్రియ (ఫోటోసింతసిస్) ద్వారా సూర్యకాంతిని ఉపయోగించి కార్బన్ డయాక్సైడ్, నీటిని గ్లూకోజ్‌గా మార్చి ఆక్సిజన్ విడుదల చేస్తాయి. ఈ ప్రక్రియ వల్ల భూమిపై ఉన్న అన్ని జీవులకు ఆహారం, శ్వాసకు అవసరమైన ఆక్సిజన్ అందుతుంది. కాబట్టి మొక్కలు ఆరోగ్యంగా ఉంటేనే జీవావరణ సమతుల్యత (ఎకలోజికల్ బాలన్స్) నిలబడుతుంది. పోషకాహారం, ఆహార భద్రతలో పాత్ర ఎంతో ఉంటుంది. మొక్కలు మనిషితో పాటు అన్ని జంతువులకు ప్రాథమిక ఆహార వనరులు.పంటల ఆరోగ్యం సరిగా ఉంటేనే ధాన్యాలు, కూరగాయలు, పండ్లు వంటి పౌష్టికాహారం సమృద్ధిగా లభిస్తుంది. మొక్కలు రోగాలకు గురైతే లేదా పురుగుల దాడికి లోనైతే దిగుబడులు తగ్గి ఆహార భద్రత (Food Security) ప్రమాదంలో పడుతుంది.అందువల్ల మొక్కల ఆరోగ్యం కాపాడటం అనేది ప్రపంచవ్యాప్తంగా పోషకాహార సంక్షేమానికి అనివార్యం. రోగాలు, పురుగులు, ప్రభావాలు ఎంతో ఉంటుంది. మొక్కలు వివిధ రకాల సూక్ష్మజీవులు (బాక్టీరియా, ఫంగస్, వైరస్), కీటక దాడులకు గురవుతాయి.ఇవి మొక్కల పెరుగుదల, ఫోటోసింథసిస్ సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి. ఉదాహరణకు పంటలలో బ్లాస్ట్, విల్ట్, రస్ట్ వంటి వ్యాధులు భారీ నష్టాన్ని కలిగిస్తాయి. ఈ సమస్యలు పెరిగితే ఆహార ఉత్పత్తి తగ్గి, ఆర్థిక నష్టాలు, జీవావరణ అసమతుల్యతలు ఏర్పడతాయి.


## గాలి-- నీరు-- ఆహారం: జీవానికి మూలాధారాలు

జీవరాశి మనుగడకు అత్యంత ఆవశ్యకమైన గాలి, నీరు, ఆహారం అనే మూడు మూలాధారాలలో 'ఆహారం' అనేది శక్తిని, పెరుగుదలను ఇచ్చే ప్రధాన వనరు కాగా, ఈ ఆహార వ్యవస్థకు మొక్కలే అసలైన పునాది. భూమిపై ఉన్న సమస్త జీవశక్తికి మూలమైన సూర్యరశ్మిని ఉపయోగించుకుని, మొక్కలు కిరణజన్య సంయోగక్రియ (ఫోటోసింతసిస్ ) అనే అద్భుతమైన ప్రక్రియ ద్వారా కార్బన్ డయాక్సైడ్, నీటిని ఆహారంగా (గ్లూకోజ్) మారుస్తాయి. ఈ ప్రక్రియలో ప్రాణవాయువైన ఆక్సిజన్‌ను విడుదల చేస్తూ, మొక్కలు "ప్రాథమిక ఉత్పత్తిదారులు" గా నిలుస్తున్నాయి.

మనం తీసుకునే శాఖాహారం నేరుగా మొక్కల నుండి వస్తే, మాంసాహారం కూడా పరోక్షంగా మొక్కలపై ఆధారపడిన జంతువుల నుండే వస్తుంది; అంటే ప్రతి ఆహార గొలుసు (ఫుడ్ చైన్ ) మొక్కలతోనే ప్రారంభమవుతుంది. గాలిలోని కార్బన్ డయాక్సైడ్, నీరు, మరియు సూర్యరశ్మి సమన్వయంతో మొక్కలు చేసే ఈ ఆహార ఉత్పత్తి ఆగిపోతే, ఆహార గొలుసు విచ్ఛిన్నమై ఆకలి కేకలు మొదలవుతాయి, జీవ వైవిధ్యం నశిస్తుంది, భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగి జీవం ఉనికికే ప్రమాదం ఏర్పడుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే, సూర్యరశ్మి లేకపోతే మొక్కలు ఉండవు, మొక్కలు లేకపోతే ఆహారం ఉండదు, ఆహారం లేకపోతే ఈ సృష్టిలో జీవమే ఉండదు. అందుకే మొక్కలను సంరక్షించడం అంటే కేవలం పర్యావరణాన్ని కాపాడటం మాత్రమే కాదు, మన మనుగడను మనం కాపాడుకోవడమే.

## జీవ వైవిధ్యం, పర్యావరణ సమతుల్యత:

ఆరోగ్యకరమైన మొక్కలు జీవ వైవిధ్యాన్ని (బయోడైవర్సిటీ) నిలబెట్టే ప్రధాన ఆధారం. అడవులు, గడ్డి భూములు, నీటి ఆవాసాలు అన్నీ మొక్కల ఆధారంగా ఏర్పడతాయి.మొక్కలు ఆరోగ్యంగా ఉన్నప్పుడు పక్షులు, కీటకాలు, జంతువులు తమ సహజ నివాసాలను పొందుతాయి.ఇది ఆహార గొలుసు (ఫుడ్ చైన్), ఆహార జాలం (ఫుడ్ వెబ్) సమతుల్యంగా కొనసాగేందుకు సహాయపడుతుంది. వాతావరణ మార్పు, మొక్కల ఆరోగ్యంపై ప్రభావాన్ని చూపుతాయి. మొక్కలు కార్బన్ సెక్వెస్ట్రేషన్ ద్వారా కార్బన్‌ను గ్రహించి వాతావరణ మార్పులను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.కానీ కాలుష్యం, వాతావరణ మార్పులు (క్లైమేట్ చేంజ్), నీటి కొరత, నేల నాశనం వంటి సమస్యలు మొక్కల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. దీని వల్ల భవిష్యత్తులో జీవావరణ స్థిరత్వం ప్రమాదంలో పడుతుంది. శాస్త్రీయ నిర్వహణ, సంరక్షణ చర్యలు ఎంతో అవసరం.మొక్కల ఆరోగ్యాన్ని కాపాడటానికి శాస్త్రీయ పద్ధతులు అవసరం. ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మానేజ్మెంట్, సేంద్రీయ వ్యవసాయం, నేల ఆరోగ్య పరిరక్షణ, నీటి సమర్థ వినియోగం వంటి విధానాలు ముఖ్యమైనవి. పంటల మార్పిడి (క్రాప్ రొటేషన్), జీవ ఎరువుల వినియోగం, సహజ శత్రువుల ఉపయోగం వంటి పద్ధతులు మొక్కల ఆరోగ్యాన్ని పెంచుతాయి.




## స్థిరమైన భవిష్యత్తు కోసం మొక్కల సంరక్షణ మన బాధ్యత:

మొక్కలు ఆరోగ్యంగా ఉంటేనే అన్ని జీవులు ఆరోగ్యంగా ఉంటాయి అనే సత్యం శాస్త్రీయంగా నిరూపితమైనది. కాబట్టి ప్రతి వ్యక్తి చెట్ల నాటడం, పర్యావరణాన్ని కాపాడడం, రసాయన కాలుష్యాన్ని తగ్గించడం వంటి చర్యలు చేపట్టాలి. అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం మనకు ఈ బాధ్యతను గుర్తు చేస్తుంది.


మొక్కల ఆరోగ్యం అనేది కేవలం వ్యవసాయానికి సంబంధించిన అంశం కాదు; అది జీవావరణం మొత్తం ఆరోగ్యానికి ఆధారం. మొక్కలు సుస్థిరంగా ఉంటేనే ఆహార భద్రత, జీవ వైవిధ్యం, వాతావరణ సమతుల్యత అన్నీ సాధ్యమవుతాయి. అందుకే "మొక్కలు ఆరోగ్యంగా ఉంటేనే జీవం ఆరోగ్యంగా ఉంటుంది" అనే భావనను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకుని ఆచరణలో పెట్టాలి.

## ప్రపంచ వృక్ష సంపద - తలసరి లభ్యత విశ్లేషణ:

ప్రపంచవ్యాప్తంగా చెట్ల పంపిణీ మరియు జనాభా నిష్పత్తిని పరిశీలిస్తే, దేశాల మధ్య భారీ అసమానతలు కనిపిస్తున్నాయి. శాస్త్రీయ అంచనాల ప్రకారం ప్రపంచంలో సుమారు 3 ట్రిలియన్ (3000 బిలియన్) చెట్లు ఉండగా, 8 బిలియన్ల జనాభాను పరిగణనలోకి తీసుకుంటే ప్రపంచ సగటున ఒక వ్యక్తికి సుమారు 375 చెట్లు వస్తాయి. అయితే, ఈ పంపిణీ దేశ భౌగోళిక విస్తీర్ణం మరియు జనాభాపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, అత్యధికంగా 642 బిలియన్ చెట్లతో రష్యా అగ్రస్థానంలో ఉండగా, కెనడా (318 బిలియన్), బ్రెజిల్ (302 బిలియన్), అమెరికా (228 బిలియన్) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జనాభా తక్కువగా ఉండి అడవులు ఎక్కువగా ఉన్న కెనడాలో ఒక వ్యక్తికి దాదాపు 8000–9000 చెట్లు అందుబాటులో ఉండగా, రష్యాలో 4000–5000 వరకు ఉన్నాయి. దీనికి భిన్నంగా, అత్యధిక జనాభా కలిగిన భారతదేశంలో మొత్తం చెట్ల సంఖ్య 35.2 బిలియన్లు ఉన్నప్పటికీ, జనాభా ఒత్తిడి కారణంగా ప్రతి వ్యక్తికి కేవలం 25 నుండి 30 చెట్లు మాత్రమే దక్కుతున్నాయి, ఇది ప్రపంచ సగటు (0.5 హెక్టార్లు/వ్యక్తి) కంటే చాలా తక్కువగా (0.05 హెక్టార్లు) ఉంది. గయానా, సురినామ్ వంటి దేశాలు తలసరి అటవీ విస్తీర్ణంలో ముందంజలో ఉండగా, చైనాలో వ్యక్తికి సగటున 100 చెట్లు మాత్రమే ఉన్నాయి. పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండాలంటే, ముఖ్యంగా భారతదేశం వంటి దేశాల్లో తలసరి ప్రకృతి వనరులను పెంచడం, భారీస్థాయిలో మొక్కలు నాటడం అత్యవసరమని ఈ గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. ప్రపంచంలో చెట్ల పంపిణీ అసమానంగా ఉంది. కొన్నిదేశాల్లో వేల చెట్లు ఒక్క వ్యక్తికి ఉంటే, మరికొన్ని దేశాల్లో చాలా తక్కువగా ఉన్నాయి. ఇది భవిష్యత్ పర్యావరణ సమతుల్యతకు పెద్ద సవాలు. ప్రతి వ్యక్తి కనీసం 10 చెట్లు పెంచితేనే భూమి భవిష్యత్తు సురక్షితం.

## మానవ చర్యలు -- మొక్కల ఆరోగ్యంపై పెరుగుతున్న ముప్పు:

మానవ ప్రేరేపిత చర్యల వల్ల నేడు మొక్కల ఆరోగ్యం మునుపెన్నడూ లేనంతగా తీవ్రమైన ముప్పును ఎదుర్కొంటోంది, ఇది పరోక్షంగా మొత్తం జీవావరణాన్నే ప్రమాదంలోకి నెడుతోంది. వ్యవసాయంలో అధికంగా వాడుతున్న రసాయన ఎరువులు, కీటకనాశకాలు నేలలోని సహజ సూక్ష్మజీవుల సమతుల్యతను దెబ్బతీస్తూ,మొక్కల సహజ రోగనిరోధక శక్తిని క్షీణింపజేస్తున్నాయి.దీనికి తోడు ప్రపంచీకరణ, వాతావరణ మార్పుల వల్ల కొత్త రకాల వైరస్‌లు, బ్యాక్టీరియా, ఫంగస్‌లు వేగంగా వ్యాప్తి చెందుతూ మొక్కలలో వేర్ల కుళ్ళు, పెరుగుదల మందగించడం వంటి వ్యాధులకు కారణమవుతున్నాయి. అడవుల నరికివేత మరియు కాలుష్యం వల్ల ప్రకృతి సమతుల్యత భంగమవడంతో, మొక్కల కిరణజన్య సంయోగక్రియ సామర్థ్యం తగ్గి పంట దిగుబడులు పడిపోతున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆహార భద్రత (ఫుడ్ సెక్యూరిటీ ) క్షీణించి, ఆహార గొలుసు విచ్ఛిన్నమవడమే కాకుండా మానవ ఆరోగ్యం మరియు జీవవైవిధ్యంపై కోలుకోలేని దెబ్బ పడుతుంది. కాబట్టి, సమగ్ర తెగుళ్ల నివారణ (ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మానేజ్మెంట్–ఐపీఎం), సేంద్రీయ వ్యవసాయం,అడవుల సంరక్షణ వంటి శాస్త్రీయ పద్ధతులను అవలంబించడం ద్వారా మాత్రమే మనం ప్రకృతిని, తద్వారా మన మనుగడను కాపాడుకోగలము.




## భూమిపై మొక్కల ఆరోగ్యక్షీణతకు ముఖ్య కారణాలు:

వృక్ష ఆరోగ్యం జీవకోటి మనుగడకు ప్రాణాధారం మరికొన్ని ప్రత్యామ్నాయాలను చూస్తే ?మొక్కల ఆరోగ్యానికి కారణాలు, ప్రభావాలు,రక్షణ మార్గాలు మనం తెలుసుకోవాలి. మొక్కల ఆరోగ్యం అనేది కేవలం అడవులు లేదా పంటల పెరుగుదలకు మాత్రమే పరిమితం కాకుండా, ఈ భూమిపై ఉన్న ప్రతి జీవి మనుగడకు అత్యంత కీలకం. మొక్కలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే కిరణజన్య సంయోగక్రియ (ఫోటోసింతసిస్), పోషకాల మార్పిడి వంటి జీవక్రియలు సమర్థవంతంగా జరిగి పర్యావరణానికి ఆక్సిజన్ మరియు ఆహారం అందుతాయి. అయితే, బాక్టీరియా, వైరస్, కీటకాలు వంటి జీవ కారణాలతో (బయోటిక్ ఫ్యాక్టర్స్) పాటు వాతావరణ మార్పులు, కాలుష్యం, నేల నాణ్యత తగ్గడం వంటి అజీవ కారణాలు (అబయోటిక్ ఫ్యాక్టర్స్) మొక్కల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. దీనివల్ల ఆకులు పసుపుబారడం, పెరుగుదల ఆగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి, ఇది క్రమంగా పంట దిగుబడి తగ్గడానికి, ఆహార భద్రత ప్రమాదంలో పడటానికి దారితీస్తుంది. మొక్కల ఆరోగ్యం క్షీణిస్తే ఆహార గొలుసులో మొదటి స్థాయి దెబ్బతిని, జీవ వైవిధ్యం నశించడంతో పాటు కార్బన్ నియంత్రణ లేక గ్లోబల్ వార్మింగ్ పెరుగుతుంది. మొక్కల ఆరోగ్యాన్ని రక్షించడానికి శాస్త్రీయ సాగు పద్ధతులు, సేంద్రీయ ఎరువుల వాడకం, సమర్థవంతమైన వనరుల నిర్వహణ అత్యంత అవసరం. సమగ్ర తెగుళ్ల నివారణ (ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మానేజ్మెంట్–ఐపీఎం), పంటల మార్పిడి వంటి పద్ధతులు మొక్కల రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఒకవేళ మొక్కల ఆరోగ్యం క్షీణిస్తే, అది నేరుగా పంట దిగుబడిని తగ్గించి ఆహార భద్రతను (ఫుడ్ సెక్యూరిటీ) ప్రమాదంలో పడేస్తుంది, తద్వారా మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అంతేకాకుండా, ఆహార గొలుసు దెబ్బతినడం, జీవ వైవిధ్యం తగ్గడం,కార్బన్ గ్రహించే సామర్థ్యం క్షీణించి గ్రీన్ హౌస్ వాయువులు పెరగడం వంటి తీవ్ర పర్యావరణ సమస్యలు తలెత్తుతాయి. అంతిమంగా, ఇది ఎడారీకరణకు, ఉష్ణోగ్రతల పెరుగుదలకు దారితీసి జీవావరణ అసమతుల్యతను కలిగిస్తుంది, కాబట్టి మొక్కల సంరక్షణ అనేది కేవలం వ్యవసాయం మాత్రమే కాదు, భూమి మనుగడకు అవసరమైన ఒక అనివార్య చర్య. మొక్కలు ఆరోగ్యంగా ఉంటేనే ఆహారం, ఆక్సిజన్, జీవ వైవిధ్యం, వాతావరణ సమతుల్యత అన్నీ కాపాడబడతాయి.

## మన భవిష్యత్తు -- మొక్కల చేతుల్లోనే:

అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం సందర్భంగా, భూమిపై జీవరాశి మనుగడకు మొక్కలే ప్రాణాధారమని చాటిచెబుతూ ఇచ్చే ముగింపు సందేశం ఏమిటంటే... "మన భవిష్యత్తు -- మొక్కల చేతుల్లోనే". అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు, అది భూమిపై ఉన్న ప్రతి జీవి మనుగడ కోసం ప్రకృతి ఇస్తున్న హెచ్చరిక. "మొక్కల ఆరోగ్యం = భూమి ఆరోగ్యం = మానవ ఆరోగ్యం" అనే సూత్రం నేటి తరం అర్థం చేసుకోవాల్సిన పరమ సత్యం. శాస్త్రీయ విశ్లేషణలు వెల్లడిస్తున్నట్లుగా, భారతదేశం వంటి జనసాంద్రత కలిగిన దేశాల్లో తలసరి చెట్ల సంఖ్య ప్రపంచ సగటు కంటే ఆందోళనకరంగా తక్కువగా ఉంది. ఈ లోటును పూడ్చకపోతే భవిష్యత్తులో ఆహార భద్రత, స్వచ్ఛమైన గాలి,నీటి లభ్యత ప్రశ్నార్థకంగా మారుతాయి.మానవ చర్యల వల్ల కలిగే కాలుష్యం, విచ్చలవిడి రసాయనాల వినియోగం,వాతావరణ మార్పుల నుండి మొక్కలను రక్షించుకోవడం మన తక్షణ కర్తవ్యం. స్థిరమైన, సురక్షితమైన రేపటి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కనీసం 10 మొక్కలను నాటి,వాటిని సంరక్షించాలి. ప్రకృతితో మమేకమై,శాస్త్రీయ సాగు పద్ధతులను ప్రోత్సహిస్తూ, అడవులను కాపాడుకుంటేనే అనంత విశ్వంలో మన ఏకైక గృహమైన ఈ 'నీలి గ్రహం' పచ్చగా కళకళలాడుతుంది. అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలతో.... మొక్కలను కాపాడుకోవటమే ప్రస్తుత మన కర్తవ్యంగా ముందుకెళ్లాలి.

**"ప్రకృతిని మనం కాపాడితే.. ఆ పచ్చదనమే మనల్ని మన భవిష్యత్ తరాలను కాపాడుతుంది."**



రవిబాబు పిట్టల, పర్యావరణవేత్త, ఫార్మర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, జే.ఎన్.టీ.యు.హెచ్, హైదరాబాద్. సెల్: +91 9849425271.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.